నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

నిజాల నిగ్గు తేల్చే చర్చ తెలంగాణ దిన పత్రిక

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 12

సోమవారం, అక్టోబర్ 06, 2025 , పేజీలు - 12 వెల: 2/-



## బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన సర్ పూర్తిపై సీఈసీ వ్యాఖ్య

**పాట్నా అక్టోబర్ 05:** బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పూర్తి కావడం పట్ల ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఆదివారం సంతృప్తి వ్యక్తం చేశారు. 22 సంవత్సరాల తర్వాత బీహార్‌లో ఓటర్ల జాబితాను 'సర్' ప్రక్షాళణ చేసిందని ఆయన అభివర్ణించారు.త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో తన పర్యటన ముగింపును పురస్కరించుకుని విలేకరుల మిగతా2లో...




## నిండు కుండలా నాగార్జున సాగర్.. 22 గేట్లు ఎత్తివేత






# కోల్డ్రిఫ్ సిరప్‌తో 14 మంది చిన్నారుల మృతి..

**న్యూఢిల్లీ, అక్టోబర్ 05:** మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో దగ్గు సిరప్ కారణంగా దాదాపు 14 మంది చిన్నారులు మృతి చెందారు. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, ఆరోగ్యశాఖ కార్యదర్శులతో కీలక సమావేశం నిర్వహించనున్నది. ఈ భేటీలో మందుల నాణ్యత విషయంలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. సాయంత్రం 4 గంటలకు సీఎస్‌లు, ఆరోగ్య కార్యదర్శులు, ఔషధ నియంత్రణ దారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దగ్గు సిరప్ హేతుబద్ధమైన ఉపయోగం, ఔషధాల నాణ్యతపై సమావేశం నిర్వహించనున్నారు. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) సరేషన్ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన దగ్గు మందు కోల్డ్రిఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ ఔషధం తీసుకున్న తర్వాత చాలా మంది పిల్లలు చనిపోయినట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ CDSCO తమిళనాడు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌కు లేఖ రాయనున్నది. చనిపోయిన పిల్లలలో మధ్యప్రదేశ్‌లోని చింద్వారా, రాజస్థాన్, మహారాష్ట్రకు చెందిన పిల్లలు ఉన్నారు. చిన్నారుల మృతి నేపథ్యంలో కేరళ, తెలంగాణ మిగతా2లో...

**కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం.. రాష్ట్రంలో ఆ దగ్గు మందు నిషేధం.**

**కోల్డ్రిఫ్ సిరప్.. 14 మంది చిన్నారుల మృతికి కారణమైన డాక్టర్ అరెస్ట్**


**మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో కోల్డ్రిఫ్ అనే దగ్గు సిరప్ తాగి 14 మంది చిన్నారులు చనిపోయిన సంగతి తెలిసిందే. కాగా ఆ సిరప్ సూచించిన డాక్టర్ ప్రవీణ్ సోనీని పరాసియా ప్రాంతంలో పోలీసులు అరెస్ట్ చేశారు**

## బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ ఓకే..

**- హమాస్ అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ: ట్రంప్**




# శ్రీశైలం ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్



**అమరావతి, అక్టోబర్ 05:** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం అభివృద్ధిపై దేవదాయ, అటవీశాఖలతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇవాళ (ఆదివారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన దివ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆలయ సమగ్రాభివృద్ధిపై చర్చించారు. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు సీఎం చంద్రబాబు.తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యాచరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలం ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రచించాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. దేవాలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల భూమిని దేవదాయశాఖకు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను అనుసంధానించేలా ప్రణాళికలు చేయాలని మిగతా2లో...

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త..

**- హరీశ్‌రావు వార్నింగ్**



**హైదరాబాద్ అక్టోబర్ 05:** ఎవరెవరు అధికారులు పోలీసోళ్లు ఇబ్బంది పెట్టిర్రో వాళ్ళందరి సంగతి చెబుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోయిన పదేళ్లు ఊకున్నాం.. ఈసారి అట్లుండదని అన్నారు.ఈసారి అభివృద్ధి చేస్తాం.. ఎక్స్‌ట్రాలు చేసిన అధికారులకు వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వాళ్లను అరెస్టు చేస్తున్నారని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త అని వార్నింగ్ ఇచ్చారు.ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి మిగతా2లో...



## ప్రతి 3 బాటిళ్లలో ఒకటి కల్తీ మందే..

**- వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు**

**అమరావతి, అక్టోబర్ 05:** ఏపీలో కల్తీ లిక్కర్‌పై సీఎం చంద్రబాబు నాయుడిపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిప్పులు కురిపించారు. చంద్రబాబు గారూ.. మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన మీరు, ఇప్పుడు నకిలీ లిక్కర్ వ్యవహారంలోనూ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నట్టున్నారని విమర్శించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో మీ పార్టీ నాయకులు ఏకంగా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేసిన ఘటన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. రాష్ట్రానికి సంపద పెరగడం సంగతేమోకాని, లిక్కర్ సిండికేట్లతో, నకిలీ మద్యం తయారీల ద్వారా, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మీ పార్టీ నాయకులు గడించిన అక్రమ సంపాదనను పైనుంచి కిందివరకూ వీరంతా పంచుకుంటున్నారని విమర్శించారు. వ్యవస్థీకృతంగా ఈ దందా కొనసాగుతోందని మిగతా2లో...

## విజయ్ ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు..



**హైదరాబాద్ అక్టోబర్ 05:** ఇటీవల తమిళనాడులోని కరూర్ ప్రాంతంలో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ నిర్వహించిన సభలో జరిగిన తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది మరణించగా, 80 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమ మిగతా2లో...



## ఎంపి అభ్యర్థిగా రాజీందర్ గుప్తాను ప్రకటించిన ఆప్

**హైదరాబాద్ అక్టోబర్ 05:** పంజాబ్ రాజ్యసభ స్థానానికి తమ అభ్యర్థిగా ప్రముఖ పారిశ్రామిక వేత్త రాజిందర్ గుప్తాను ఎంపిక చేసినట్లు ఆప్ ప్రకటించింది. ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజీవ్ అరోరా రాజీనామా చేయడంతో రాజ్యసభ స్థానం ఖాళీ అయిన మిగతా2లో...

# బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన సర్ పూర్తిపై సీఈసీ వ్యాఖ్య

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 243 నియోజకవర్గాలలో ఒకరు చొప్పున ఓటరు నమోదు అధికారి(ఈఆర్ఓ) ఉన్నారని చెప్పారు. ఎస్ఐఆర్‌ని పూర్తి చేయడంలో వారికి 90,207 మంది బీఎల్ఓలు సాయపడ్డారని ఆయన తెలిపారు.

## కోల్డ్రిఫ్ సిరప్‌తో 14 మంది చిన్నారుల మృతి..

(మొదటి పేజీ తరువాయి)

సైతం ఈ సిరప్ వాడకాన్ని ఆపేయాలని హెచ్చరించింది. కోల్డ్రిఫ్ సిరప్ తయారీ కంపెనీపై తీవ్రమైన నేరాల కింద కఠిన చర్యలు తీసుకోవాలని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) తమిళనాడు mFDA (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్)ను కోరనున్నది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఫ్యాక్టరీలపై సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) దర్యాప్తు ప్రారంభించింది. ఈ సందర్భంలో సీడీఎస్‌సీవో దగ్గు సిరప్‌లు, యాంటీబయాటిక్స్, జ్వరం మందులు సహా 19 ఔషధాల నమూనాలను సేకరించింది. మధ్యప్రదేశ్‌లోని నెక్స్‌ట్రో డీఎస్ అనే మరో కంపెనీ నుంచి కాఫ్ సిరప్ నమూనాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నది. సిరప్‌లు, యాంటీబయాటిక్స్, జ్వరం మందులు, ఒండాన్‌సెట్రాన్‌తో సహా మొత్తం 19 నమూనాలను సేకరించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం వెంటనే కోల్డ్రిఫ్, నెక్స్‌ట్రో డీఎస్ సిరప్‌ల అమ్మకాలను నిషేధించింది. అదే కంపెనీ ఇతర ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ నిషేధాన్ని ప్రకటించారు.రెండు సం.రాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు దగ్గు సిరప్ ఇవ్వవద్దని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు, దగ్గు సిరప్‌ను వైద్యుల సలహా మేరకు, పరిమిత పరిమాణంలో, జాగ్రత్తగా మాత్రమే వాడాలని చెప్పింది. అదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం సైతం కోల్డ్రిఫ్ సిరప్ వాడకాన్ని నిషేధించింది. డైథిలిన్ గ్లైకాల్ (DEG) అనే విషపూరిత రసాయనం ఇందులో గుర్తించామని.. కిడ్నీలకు తీవ్రమైన హాని కలిగిస్తు ందని.. ప్రాణాంతకం కావచ్చని పేర్కొంది. ప్రజలు ఈ సిరప్‌ను వాడకాన్ని నిలిపివేయాలని కోరింది.

## నిండు కుండలా నాగార్జున సాగర్.. 22 గేట్లు ఎత్తివేత

**హైదరాబాద్ అక్టోబర్ 05:** నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో జలాశయం నిండు కుండలా మారింది. దీంతో ప్రాజెక్టు 22 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 2.27 లక్షల క్యూసెక్కులుగా ఉంది. సాగర్ కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులను, ఎడమ కాల్వకు 8,896 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్ పవర్ హౌస్‌కు 33,739 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1.72 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 587.50 అడుగులుగా ఉంది. సాగర్ నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు, ప్రస్తుత నీటినిల్వ 305.80 టీఎంసీలుగా ఉంది.

## బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ ఓకే..

**• హమాస్ అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ: ట్రంప్**

**వాషింగ్టన్ అక్టోబర్ 05:** రెండేండ్లుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగింపునుకు మరో ముందడుగు పడింది. గాజా నుంచి బలగాలను ఉపసంహరించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. హమాస్ కూడా దీన్ని అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని తెలిపారు. గాజాలో శాంతి స్థాపనకు ట్రంప్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 20 అంశాలతో కూడిన ప్రణాళికను ఇరు పక్షాల ముందు ఉంచారు. దీనికి ఇజ్రాయెల్‌తోపాటు హమాస్ కూడా అంగీకరించిన విషయం తెలిసిందే.ప్రణాళికలో తొలిదశలో భాగంగా గాజా నుంచి బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు. దీనిని హమాస్‌కు కూడా పంపించామని, అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని చెప్పారు. దీంతో ఇజ్రాయెల్- హమాస్ మధ్య బందీలు, ఖైదీల అప్పగింత ప్రారంభమవుతుందని తెలిపారు. బందీల అప్పగింత తర్వాత బలగాలు ఉపసంహరణకు నిబంధనలు రూపొందిస్తామని తన ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు చేశారు.

## శ్రీశైలం ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు సీఎం చంద్రబాబు.శ్రీశైలంలోని పులుల అభయారణ్యం అభివృద్ధికి పలు సూచనలు చేశారు సీఎం చంద్రబాబు. భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న సందర్భంగా సౌకర్యాలు విస్తరించాలని పవన్ కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు.

## విజయ్ ప్రచార రథం సీజ్ చేసిన పోలీసులు..

(మొదటి పేజీ తరువాయి)

విచారణను వేగవంతం చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే, విజయ్‌కు మరో షాక్ తగిలింది.కరూర్ సభ జరగడానికి కొన్ని గంటల ముందు విజయ్ ప్రచార రథం ఇద్దరు యువకులను ఢీకొట్టింది.వారు తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలించారు.

## ఎంపి అభ్యర్థిగా రాజేందర్ గుప్తాను ప్రకటించిన ఆప్

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. ఈ పదవిని భర్తీ చేసేందుకు అక్టోబర్ 24న ఉప ఎన్నికలు నిర్వహించనున్న ట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఎంపి పదవి కోసం రాజిందర్ గుప్తాను నామినేట్ చేయాలని రాజకీయ వ్యవహారాల కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ట్రైడెంట్ గ్రూప్ ఎమెరిటస్ చైర్మన్ అయిన రాజిందర్ గుప్తా ఇటీవల రాష్ట్రఆర్థిక విధానం మరియు ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్ష పదవికి మరియు కాళీదేవి ఆలయ సలహా కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆయనను రాజ్యసభకు పంపవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త..

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు సమక్షంలో బీజేపీ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత పన్నులేసుడు తప్ప కొత్తవి ఇచ్చిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. మళ్లీ భూముల ధరలు పడిపోయాయని తెలిపారు. బీర్ల ధరలు, విస్కీ ధరలు పెంచిండని తెలిపారు. ఆడోళ్లకి ఫ్రీ బస్సు అన్నాడు.. మొగోళ్లకు డబల్ టికెట్ కొడుతున్నారని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన పథకాలను బందు పెట్టిండు.. న్యూట్రిషన్ కిట్టు బందు.. కేసీఆర్ కిట్టు బందు.. బతుకమ్మ చీరలు బంద్ అయినాయన్నారు. కేసీఆర్ ఉండంగా ఎట్ల ఇచ్చిండు.. రేవంత్ రెడ్డి ఎందుకు బంద్ చేసిండు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది కేవలం దోచుకునే ప్రభుత్వమని విమర్శించారు.మల్ల ఎటు చూసినా కేసీఆర్ రావాలనే గాలి మొదలైందని హరీశ్‌రావు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్యాకేజి తెస్తా ప్యాకేజీ తెస్తా అన్నాడు.. రేవంత్ రెడ్డి వచ్చి ప్యాకేజ్ ఇస్తా అన్నాడు అని తెలిపారు. వరదలు వచ్చి రోజులు దాటినా ఒక్క రూపాయి అయినా రేవంత్ రెడ్డి ఇచ్చాడా అని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10,000 ఇస్తామన్నారని.. ఒక రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తొందర్లో కాంగ్రెస్ బాకీ కార్డులు కూడా నియోజకవర్గానికి వస్తాయన్నారు. ప్రతి ఇంటికి బాకీ కార్డులను చేర్చాలని సూచించారు.ప్రతి అక్కకు చెల్లెకు మహాలక్ష్మి కింద నెలకు 2500 ఇస్తానన్నాడని హరీశ్‌రావు తెలిపారు. 22 నెలలు నిండినై.. ఒక్కొక్క మహిళకు 55 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని అన్నారు. ఎవరైనా కాంగ్రెస్ వాడు ఊర్లకు వస్తే 55 వేల రూపాయలు ఇచ్చి మాట్లాడండి అని గల్ల పట్టి నిలదీయాలన్నారు. 200 పెన్షన్ 2000 చేసింది కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ ఇస్తున్న రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు చేస్తానని రేవంత్ రెడ్డి అన్నాడని గుర్తుచేశారు. అవ్వకిస్తా, తాతకిస్తా, కోడలికిస్తా అన్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వృద్ధులకు 44వేల రూపాయలు బాకీ పడిందని అన్నారు.రైతుబంధు 15వేలు ఇస్తా అన్నారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 15 వేలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. పోయిన యాసంగికి 3 ఎకరాలకు ఇచ్చి మిగితా ఎగ్గొట్టిండని విమర్శించారు. కౌలు రైతుకి ఇస్తా, రైతుకి ఇస్తా అన్నాడని తెలిపారు. రైతుకు లేదు.. కౌలు రైతుకు లేదని అన్నారు. ఒక సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అన్నాడని.. కానీ 5 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు. పథకాలు కటింగ్ పెడుతాడు. కేసీఆర్ కట్టిన బిల్డింగ్ లకు రిబ్బన్ కత్తిరిస్తారని అన్నారు. ప్రజలకు పాలేందో నీలేవో తెలిసిపోయిందన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా 100 సీట్లు బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# ప్రతి 3 బాటిళ్లలో ఒకటి కల్తీ మందే..

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు.మీ లిక్కర్ సిండికేట్లకు, గ్రామస్థాయి వరకూ విస్తరించిన బెల్టుషాపుల మాఫియాలకు, కల్తీ మద్యం వ్యాపారానికి అడ్డురాకూడదనే ఉద్దేశంతోనే ఒక వ్యూహం ప్రకారం మీరు ప్రభుత్వ మద్యం దుకాణాలపై విష ప్రచారం చేశారని వైఎస్ జగన్ అన్నారు. ఉద్దేశపూర్వకంగా వాటిని తీసివేసి, వాటి స్థానంలో మీ సిండికేట్లకు అప్పగించారని అన్నారు. మద్యం దుకాణాలు టీడీపీ వాళ్లవే అని తెలిపారు. బెల్టుషాపులు టీడీపీ వాళ్లవే అని పేర్కొన్నారు. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు టీడీపీ వాళ్లవే అని ఆరోపించారు. అక్రమ మద్యం తయారీ దారులు కూడా టీడీపీ నేతలే అని.. వాళ్లు తయారుచేస్తారు, ఆ తయారు చేసిన దాన్ని మీ వాళ్లే, మీ షాపులద్వారా, మీ బెల్టుషాపుల ద్వారా అమ్ముతారని తెలిపారు. అలా వచ్చిన డబ్బును వాటాలు వేసుకుని పంచుకుంటారన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి కల్తీ మద్యమేనన్న వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని మండిపడ్డారు.లిక్కర్ వ్యవహారంలో మీ వ్యవస్థీకృత నేరాల ద్వారా ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడ్డమే కాదు, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బును మీరు దోచుకుంటున్నారని ఆరోపించారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దుచేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలను పెంచారని అన్నారు. మార్టులు పెట్టారు, తిరిగి మళ్లీ ఇల్లీగల్ బెల్టుషాపులు తెరిచారు, ప్రతి వీధిలోనూ పెట్టారు, రాత్రిపగలు తేడాలేకుండా లిక్కర్ అమ్మడం మొదలుపెట్టారు. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు తెరిచారని మండిపడ్డారు. ఇంత విచ్చలవిడిగా తాగిస్తున్నా సరే, CAG నివేదికల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఐదు నెలల్లో, అంటే ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే లిక్కర్ అమ్మకాలు ఉన్నప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం ?6,782.21 కోట్లు కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లో, విచ్చలవిడిగా లిక్కర్ అమ్మినా సరే ఆదాయం ?6,992.77 కోట్లు మాత్రమే వచ్చిందని అన్నారు.. కేవలం 3.10% వృద్ధి మాత్రమే ఉందన్నారు. ఎక్కడైనా ప్రతిఏటా సహజంగా వచ్చే 10% పెరుగుదల కూడా రాలేదని.. అంటే దీని అర్థం, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని, సిండికేట్ల రూపంలో, కల్తీ లిక్కర్ తయారీ రూపంలో మీ ముఠా కొట్టేస్తున్నట్టేగా అర్థమని ప్రశ్నించారు.కల్తీ లిక్కర్ వ్యవహారాలు కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయని వైఎస్ జగన్ తెలిపారు. ఉత్తరాంధ్రలోనూ, గోదావరి జిల్లాల్లోనూ, ఇప్పుడు రాయలసీమలోనూ ఈ ఘటనలు బయటకు వచ్చాయన్నారు. కానీ విచారణ, దర్యాప్తు తూతూమంత్రంగానే సాగుతున్నాయన్నారు. దీనికి కారణం.. ఈ అక్రమాల వెనుక ఉన్నది మీ బినామీలు అయిన మీ టీడీపీవాళ్లే అని ఆరోపించారు. దీన్ని అరికట్టాలన్న చిత్తశుద్ధి ఉండి ఉంటే, ఇవాళ ములకలచెరువు ఘటన తర్వాత సప్లై చేసిన మద్యం షాపుల్లోనూ, బెల్టుషాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు జరిగి, కల్తీ బాటిళ్లను పట్టుకునేవారన్నారు. కానీ అలా జరగలేదని తెలిపారు.పైగా దీనికి కారకులైన వారిని రక్షించే ప్రయత్నం చేశారని వైఎస్ జగన్ మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా స్థాయి ముఖ్యనేత, టీడీపీ ఇన్‌ఛార్జి కనుసన్నల్లో ఈ కల్తీమద్యాన్ని తయారు చేస్తే, వీరిని తప్పిస్తూ తూతూమంత్రంగా కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో నిందితుడు, టీడీపీ ఇన్‌ఛార్జి అనచరుడు మద్యం దుకాణం వైపు అధికారులెవ్వరూ కన్నెత్తిచూడలేదన్నారు. ఈ నేరాన్నంతటినీ విదేశాల్లో ఉన్న మరోవ్యక్తిపైకి తోసేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అసలు సూత్రధారులను కాపాడేలా స్కెచ్ వేసి, మీరు ఇచ్చిన ఆదేశాల మేరకు, మీ కార్యాలయ డైరెక్షన్‌లో రాత్రికి రాత్రే కేసు మార్చేశారన్నారు. దీనికి కారణం, ఈ దందాకు మీ నుంచి, మీ చెప్పుచేతల్లో ఉన్న వ్యవస్థలనుంచి పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయి కాబట్టే అని అన్నారు. మీ సొంత ఆదాయాలకోసం ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం న్యాయమేనా అని నిలదీశారు.

# తుస్సుమన్న ఫ్రీ బస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసీ: కేటీఆర్




**హైదరాబాద్ అక్టోబర్ 05:** సిటీ బస్సు చార్జీల పెంపుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జంటనగరాల్లో బస్ చార్జీల పెంపు నిర్ణయం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకేసారి ఏకంగా రూ.10 పెంచి పేద, మధ్య తరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని సీఎం నిర్ణయించారని ధ్వజమెత్తారు. చార్జీల పెంపుతో ప్రయాణికుడిపై నెలకు రూ.500 అదనపు భారం పడుతుందని చెంపారు. బడుగు జీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస చార్జీపై 50 శాతం ధర పెంచడం అసమర్థ విధానాలకు నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకున్నారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.'సిటీ బస్సు చార్జీలను ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఒకేసారి 10 రూపాయలు పెంచి జంట నగరంలోని పేద మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని చూస్తున్న రేవంత్ రెడ్డి నిర్ణయాలు దుర్మార్గమైనవి. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న తరుణంలో.. ప్రతి ప్రయాణికుడిపై నెలకు 500 రూపాయల అదనపు భారం మోపితే బడుగుజీవులు ఎలా బతకాలో ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలి. ఇప్పటికే విద్యార్థుల బస్ చార్జీలు, టీ-24 టిక్కెట్ చార్జీలను పెంచింది చాలదన్నట్టు.. ఇప్పుడు కనీస చార్జీపై కనికరం లేకుండా 50 శాతం టిక్కెట్టు ధరలను పెంచడం రేవంత్ అసమర్థ విధానాలకు నిదర్శనం. రాజధానివాసుల నడ్డివిరిచి ప్రతినిత్యం దాదాపు కోటి రూపాయల భారం మోపాలని చూస్తున్న ముఖ్యమంత్రి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకుంటున్నట్టు అర్థమవుతోంది. తుస్సుమన్న ఫ్రీ బస్సు పథకంతో దివాళా తీసిన ఆర్టీసిని గట్టెక్కించాల్సిందిపోయి, సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం క్షమించరానిది.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## హైదరాబాద్ - విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్..

**హైదరాబాద్ అక్టోబర్ 05:** దసరా సెలవులు ముగియడంతో.. గ్రామాల నుంచి హైదరాబాద్ నగరానికి ప్రజలు తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ నగరానికి వచ్చే అన్ని రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. మరి ముఖ్యం గా హైదరాబాద్ - విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. కిలోమీటర్ల మేర వాహనాలు నెమ్మదిగా కదులుతున్నా యి. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రయివేటు వాహనాలు ఒకదా ని వెంట మరొకటి బారులు తీరాయి. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది.

## తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు.. హెచ్చరించిన వాతావరణశాఖ



**హైదరాబాద్ అక్టోబర్ 05:**తెలంగాణలో రాగల మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదివారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. సోమవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలలతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

# డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి కి అంతర్జాతీయ స్థాయి ఉత్తమ గురు అవార్డు - 2025

**- డాక్టర్ అట్ల ను సన్మానించిన ఎస్.ఆర్.ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ**




చర్చ :- కరీంనగర్ విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ సైకాలజిస్ట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డికి ఇంటర్నేషనల్ బెస్ట్ గురు అవార్డు 2025 లభించింది. ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ గురు, స్టూడెంట్స్ %ఆ% పేరెంట్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 5 అక్టోబర్ 2025 ఆదివారం రోజున కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ టీచర్స్ డే 2025 వేడుకల సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి స్వయం ప్రతిపత్తి కలిగిన ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ %ఆ% పిజి కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గురువు అనేది కేవలం బోధకుడు మాత్రమే కాదు, విద్యార్థుల మనసుల్లో వెలుగుని నింపే దీపం. విద్య ద్వారా మానసిక స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, మానవతా విలువలను బలపరచడం నిజమైన గురువు ధర్మం. ఈ అవార్డు నాకు మరింత బాధ్యతను కలిగించింది. భవిష్యత్తులో విద్యార్థుల మానసిక ఆరోగ్యాభివృద్ధి కోసం ఇంకా విస్తృత సేవ చేయాలనే తపనతో ఉన్నాను అని అన్నారు.కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గంగారపు మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ వి. కిరణ్, జనరల్ సెక్రటరీ పి. జయంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ కె. అంజ బాబు, కోఆర్డినేటర్ డి. అంజన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గంగారావు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు అతిథులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.

# డిజిపి శివధర్ రెడ్డిని కలిసిన వెలిచాల రాజేందర్ రావు



కరీంనగర్..తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ విజయ్ కుమార్ ను హైదరాబాదులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డిజిపి, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ లకు రాజేందర్ రావు పూలబొకేలు అందించి శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిజి పితో పలు అంశాలపై వెలిచాల రాజేందర్ రావు చర్చించారు. తెలంగాణ పోలీస్ శాఖకు దేశంలో మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని రాజేందర్ రావు పేర్కొన్నారు. పోలీస్ శాఖలో చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. పోలీస్ శాఖ బాధితు లకు అండగా నిలుస్తూ నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవడంలో దేశంలోనే ముందంజలో ఉందని అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ కొత్త డీజీపీ సారథ్యంలో పోలీస్ శాఖ అత్యుత్తమైన సేవలందిస్తూ మరింతగా ప్రజల అభిమానాన్ని చురగొనాలని రాజేంద్ర రావు ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలు కృషి చేస్తున్న పోలీస్ శాఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దొంగ ఓట్లతో దొడ్డి దారిన బీజేపీ అధికారంలోకి వస్తుంది

- దేశ వ్యాప్తంగా ఓటు చోరీ పై రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమం చేపట్టాం
- సంతకాల సేకరణ ద్వారా ప్రతి డివిజన్ నుండి ప్రజల అభిప్రాయాలు సేకరిస్తాం
- కొత్త 64 వ డివిజన్ ఇందిరా చౌక్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించాం
- ఈ నెల 17 లోపల అన్ని డివిజన్లలో సంతకాల సేకరణ జరుగుతుంది

**సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**





చర్చ :- కరీంనగర్ దేశ వ్యాప్తంగా నమోదు చేసుకున్న దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం కళ్లు తెరవాలని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.ఇందిరా చౌక్ వద్ద కొత్త 64 వ డివిజన్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఓటు చోరీని అరికట్టడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ నెల 17 తారీఖు లోపల అన్ని డివిజన్లలో డివిజన్ అధ్యక్షులు ఇంచార్జులు సంతకాల సేకరణ చేయాలని ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యనాయకులు పాల్గొంటారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేంతవరకు ఇలాంటి కుట్రలను తిప్పి కొడుతామని ఓటు చాలా విలువైనదని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని నరేందర్ రెడ్డి అన్నారు.డివిజన్ బాధ్యుడు పెద్దిగారి తిరుపతి ఆధ్వర్యంలో 64 డివిజన్ కు సంబంధించిన పి.పద్మ, కోమలత, మనీషా,ఆరిఫ్,వెన్నెల,సోహెల్ శివాని తదితరులు పత్రాల పై సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్,కొరివి అరుణ్ కుమార్,బోనాల శ్రీనివాస్,అబ్దుల్ రహీమాన్,అహ్మద్ అలీ,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,ఎండి చాంద్,దండి రవీందర్,కుర్ర పోచయ్య,నెల్లి నరేష్,యసమల మంజుల,షబానా మహమ్మద్,ముల్కల కవిత,ఊరడి లత,హసీన,జ్యోతి రెడ్డి,వంగల విద్యా సాగర్,సలీం, సుదర్శన్,నాగుల సతీష్,మాదాసు శ్రీనివాస్,బత్తిని చంద్రయ్య, మహమ్మద్ భారీ,షెహెన్ష తదితరులు పాల్గొన్నారు.

# పల్లా వెంకటరెడ్డికి ఘన సన్మానం



చర్చ, ఖమ్మం: సి.పి.ఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికై తొలిసారి ఖమ్మం వచ్చిన సి.పి.ఐ నాయకులు పల్లా వెంకటరెడ్డిని భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఛండీఘడ్‌లో గత నెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ మహాసభల్లో పల్లా వెంకటరెడ్డి జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శాసనసభ్యునిగా, సి.పి.ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గసభ్యునిగా గతంలో పల్లా వెంకటరెడ్డి పనిచేశారు. సన్మానించిన వారిలో సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జాతీయ సమితిసభ్యులు ఎస్.కె. సాబీర్ పాషా, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మద్ మౌలానా, సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్.కె. జానిమియా, ముత్యాల సత్యనారాయణ, కల్లూరి వెంకటేశ్వరరావు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బి.జి. క్లైమెంట్, అజ్మీర రామ్మూర్తి, సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవల సవరించిన ఛార్జీలు స్పష్టంగా ప్రదర్శించాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ సేవలపై సవరించిన కొత్త రుసుములు 2025 అక్టోబర్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఈ మార్పులపై పూర్తి అవగాహన కల్పించే విధంగా అన్ని ఆధార్ సేవా కేంద్రాల్లో కొత్త రుసుముల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. బయోమెట్రిక్ అప్‌డేట్ (ఫింగర్‌ప్రింట్, ఐరిస్, ఫోటో) కోసం 5%-7, 15-%17 ఏళ్ల పిల్లలకు ఒకసారి అప్‌డేట్ చేయడం ఉచితమని, మిగతా సందర్భాల్లో రూ.125/%-% మాత్రమే వసూలు చేయాలన్నారు. డెమోగ్రాఫిక్ అప్‌డేట్ అంటే పేరు, లింగం, జన్మతేదీ, చిరునామా, మొబైల్, ఇమెయిల్ వంటి వివరాలను మార్చడం బయోమెట్రిక్ అప్‌డేట్‌తోపాటు చేస్తే ఉచితమని, వేరుగా చేస్తే రూ.75/%-% మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. డాక్యుమెంట్ అప్‌డేట్ అంటే ఐడీ, చిరునామా డాక్యుమెంట్స్ సమర్పించడం వంటివి మై ఆధార్ పోర్టల్ ద్వారా చేస్తే ఉచితమని, ఎన్‌రోల్మెంట్ సెంటర్ ద్వారా చేస్తే రూ. 75/%-% వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. హోమ్ ఎన్‌రోల్మెంట్ సర్వీస్ కోసం ఫీజు రూ.700/%-%, ఒకే చిరునామాకు బహుళ మంది తీసుకుంటే మొదటి వ్యక్తికి రూ.700, మిగతా వ్యక్తులకి రూ.350 చార్జ్ చేయాలన్నారు. ఆధార్ డౌన్‌లోడ్ చేసి ముద్రించుకోవడానికి రూ.40/%-% చెల్లించవలసి ఉంటుంది అని తెలిపారు. జిల్లా ప్రజలు ఆధార్ సంబంధిత సేవల కోసం కేవలం అధికారిక ఆధార్ సేవా కేంద్రాలు లేదా గుర్తింపు పొందిన సెంటర్లను మాత్రమే వినియోగించాలని కోరారు. ప్రజల్లో ఏ విధమైన అపోహలు లేకుండా సవరించిన రుసుములపై విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# కలెక్టరేట్ సమీపంలో భారీ కొండచిలువ



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమీపంలో శనివారం అర్ధరాత్రి 12 అడుగుల భారీ కొండచిలువ కన్పించింది. ఇది గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులు, మున్సిపల్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ జిమ్ సంతోష్‌కు సమాచారం ఇచ్చారు. సంతోష్ ఎంతో చాకచక్యంగా ఆ కొండ చిలువను బంధించి అదే రాత్రి దట్టమైన రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు. కొండచిలువ గర్భంతో ఉందని, స్వారం వెతుక్కుంటూ వచ్చి ఉండొచ్చని, భారీగా ఉన్నప్పటికీ విష రహిత సర్పమే అని, భయం అక్కర్లేదని సంతోష్ స్థానికులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణి చట్టం షెడ్యూల్ ఎ కేటగిరి లోకి ఈ పాము వస్తుందని వివరించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రామ్ ప్రసాద్, బాబో సింగ్, బేస్ క్యాంప్ గణేష్, శ్రీకాంత్, మహేష్ డ్రైవర్ ఏడు కొండలు సంఘటన స్థలం వద్ద ఉన్నారు.

# ఎన్నికల లబ్ధి కోసమే ఆర్థిక లబ్ధి

- జి.ఎస్.టి. పేరుతో రూ.15 లక్షల కోట్ల దోపిడి
- ప్రోత్సాహకాల పేరుతో ప్రజలను వంచిస్తున్న బీజేపీ
- క్షేత్రస్థాయిలో బలహీనపడుతున్న బీజేపీ
- సి.పి.ఐ రాష్ట్ర సమితి సమావేశంలో నారాయణ




చర్చ, ఖమ్మం:దేశంలో ఈ ఏడాది చివరిలో, వచ్చే ఏడాది మొదటి త్రైమాసంలో పలు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగనున్నాయని, ఎన్నికలలో లబ్ధికోసమే బీజేపీ ఎన్నికల బోనాంజపేరుతో ఆర్థిక లబ్ధి చేకూరుస్తుందని సి.పి.ఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ కె. నారాయణ ఆరోపించారు. బీహార్ సహా పలు రాష్ట్రాలలో ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తుందని, ఇందుకోసం వేల కోట్ల రూపాయలను దుంపు చేసిందని ఆయన అన్నారు. సి.పి.ఐ రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం ఖమ్మం సరిగమ పంక్షన్ హాల్‌లో దండి సురేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ ఇప్పటికే బీజేపీ దొడ్డిదారిన దొంగ ఓట్లతో బయటపడిందన్నారు. బీజేపీ అంతా బాగున్నట్లు భ్రమింపచేస్తుందని వాస్తవానికి క్షేత్రస్థాయిలో బీజేపీ బలహీనపడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజల్లో ప్రజా స్వామ్యత భావజాలం బలంగా ఉందని, బీజేపీ ప్రజా స్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజలు నిరసిస్తున్నారన్నారు. జి.ఎస్.టి. తగ్గింపు వ్యవహారం కార్పోరేట్ కంపెనీల వంటగా ఆఫర్ లాంటిదని, కంపెనీలు ధరలుపెంచి తగ్గిస్తుంటాయని, జి.ఎస్.టి. తగ్గింపు కూడా అటువంటిదేనన్నారు. జి.ఎస్.టి.పేరుతో 9 ఏళ్ళ కాలంలో రూ.15 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం ప్రజల నుంచి లూటీ చేసిందని ఆరోపించారు. రూ.16 లక్షల కోట్లు దోపిడి చేసిన 29 మంది కార్పోరేట్ అధిపతులకు కేంద్ర ప్రభుత్వానికి పెద్ద తేడాలేదని విమర్శించారు. దేశంలో డిజిటల్ దోపిడి పెరిగి పోతున్నదని, ఏఐ పేరుతో ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించి దోపిడికి పాల్పడుతుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేరుతోనే ఒక ప్రకటన విడుదల చేసి వందల కోట్ల రూపాయలను దోపిడి చేసేందుకు ప్రయత్నం జరుగుతుందని హెచ్చరించారు. కమ్యూనిస్టులుగా ఈసాంకేతిక పరిజ్ఞానం గురించి ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందని నారాయణ అభిప్రాయపడ్డారు.

**– గెలుపే లక్ష్యంగా కార్యాచరణ: కూనంనేని**

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి అందుకనుగుణంగా పనిచేయాలని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్రసమితి సమావేశంలో ఆయన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్ర, జాతీయ మహాసభల నిర్ణయాలను వెల్లడించిన కూనంనేని స్థానిక పరిస్థితులకనుగుణంగా ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లాలని, సైద్ధాంతిక, పార్టీ భావజాల ప్రచారం జరగాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీలు ఒక్కో రకమైన సమస్యలతో రాజకీయ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీల పట్ల ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతుందని, అదే సమయంలో బి.ఆర్.ఎస్.లో ఇంటిపోరు, కాళేశ్వరం తదితర అంశాలు చర్చనీయ అంశాలయ్యాయన్నారు. బీజేపీ బి.సి. రిజర్వేషన్ల విషయంలో దొంగాట ఆడుతున్నదని కూనంనేని ఆరోపించారు. బి.సి. రిజర్వేషన్ల రాజకీయ పార్టీలు ద్వంద విధానాన్ని అవలంభిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, జాతీయ నాయకులు అజీజపాషా, చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, ఈటి నర్సింహా, ఎం.ఎల్.సి. నెల్లకంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు

# నేడు ప్రజావాణి రద్దు: కలెక్టర్

చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్న కారణంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ వినతిపత్రాలు, దరఖాస్తులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇన్‌వార్డ్ విభాగంలో సమర్పించవలసిందిగా సూచించారు. వాటిని సంబంధిత విభాగాలకు పంపబడతాయని ఆయన తెలిపారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించిన 'మాటూరి'




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:చెన్నైలో బాలమురుగన్ నిర్వహించిన ప్రత్యేక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణం గాజులరాజం బస్తీకి చెందిన మార్షల్ ఆర్ట్స్ గురువు మాటూరి మహావిష్ణుమూర్తి పాల్గొని, అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఆదివారం చెన్నైలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక అధిపతి రిషి నాథ్ హాజరై మాటూరి మహావిష్ణుమూర్తికి గౌరవపూర్వకంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. మహావిష్ణుమూర్తి తన కృషి, అంకితభావంతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు

## హిందూ సంఘటనయే దేశానికి రక్షణ


**- ఆర్.ఎస్.ఎస్ విభాగ్ సంఘచాలక్ గార్లపాటి వెంకటయ్య**



**చర్చ.. ప్రతినిధి నల్గొండ జిల్లా** హిందూ సంఘటన ద్వారానే దేశం రక్షించబడుతుందని హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ ఎస్ ఎస్ కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా నల్లగొండ నగర శాఖ ఆద్వర్యంలో స్థానిక మేకల అభినవ్ స్టేడియం నుండి నాగార్జున కళాశాల వరకు నల్లగొండ నగర పురవీధుల గుండా నగర స్వయంసేవకులు పద సంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని చెప్పారు, హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు, హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత,కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ,పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలని అన్నారు. ఆర్ఎస ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని ఆర్ ఎస్ ఎస్ ఈ దేశ పరిరక్షణకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అంద రూ స్వాగతించాలని కోరారు. దేశ వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆర్ ఎస్ ఎస్ ను ప్రజలకు చేరువ చేసిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సాహ సంగచాలక్ ఇటికా ల కృష్ణయ్య, సంఘచాలక్ దోసపాటి శ్రీనివాస్ విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పాల్గొన్నారు

## స్థానిక సంస్థలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో దృష్ట్యా పోలీస్ గ్రీవెన్స్ డే రద్దు.

**- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**చర్చ.. ప్రతినిధి నల్గొండ జిల్లా** స్థానిక సంస్థలు ఎన్నికలు జడ్పిటిసి,ఎంపిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత తిరిగి యధావిధిగా ప్రతి సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అందువల్ల జిల్లా లోని ప్రజలు ప్రతి సోమవారం ఫిర్యాదులను సమర్పించే నిమిత్తం జిల్లా పోలీస్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిక

**- వేముల వీరేశం శాసనసభ్యులు నగరికల్**





**చర్చ ప్రతినిధి నల్గొండ జిల్లా.**కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై నేడు చిట్యాల మండలం వెంబాయి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు కాంగ్రెస్ పార్టీ కాండువాలు కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకై కృషి చేయాలని తెలిపారు.

## లే..నేను.అస్సలు చెయ్యా..!

**- ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై దానం నాగేందర్ క్లారిటీ.**




**హైదరాబాద్, అక్టోబర్ 5 (చర్చ ):** ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయబోతున్నారని జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని అన్నారు. నేనంటే గిట్టని వాళ్లు నాపై దుష్ప్రచారం చేస్తున్నారని రాజీనామా అనే ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దన్నారు. నేను రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని క్లారిటీ ఇచ్చారు. కాగా పార్టీ ఫిరాయింపుల అంశంపై స్పీకర్ విచారణ చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్ రాజీనామా చేయబోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. రాజీనామా విషయంలో కాంగ్రెస్ పార్టీ, తన అనుచరులతో ఈ పాటికే దానం చర్చించారని, ఆదివారం సాయంత్రమే ఆయన రాజీనామా చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్పందించిన దానం జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు.

# అధికారుల నిర్లక్ష్యం ఇదిగో సాక్ష్యం!

**- చెరువును తలపిస్తున్న జాతీయ రహదారి**









**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ఏళ్ల తరబడి చేస్తున్న రోడ్డు వెడల్పు పనులు పూర్తికాకపోవడంతో జాతీయ రహదారి చెరువుగా మారింది. సైడ్ కాల్వలు పూర్తి చేయకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా జాతీయ రహదారిపై నీళ్లు నిలిచి చెరువును తలపిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ %-% జగదల్పూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొత్తగూడెం పట్టణ పరిధిలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు గల జాతీయ రహదారి విస్తరణ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. సుమారు ఆరేళ్ల క్రితం పనులు ప్రారంభించినా, ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు వెడల్పు సమయంలో జాతీయ రహదారి అధికారులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. పనులు పూర్తి అయినట్టే బిల్డప్ ఇచ్చిన వారు ఇప్పుడు కనిపించడం లేదు. ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పోస్టాఫీస్ సెంటర్ సమీపంలోని సెయింట్ మేరీస్ పాఠశాల వద్ద జాతీయ రహదారి పూర్తిగా నీటమునిగిపోయింది. ప్రతిరోజు ఈ రహదారి గుండా ప్రయాణించే వందలాది వాహనదారులు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రాణాలకు తెగించి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడిన ప్రతీసారి ఇదే సీన్ రిపీట్ అవుతూ వస్తోంది. అయినా జాతీయ రహదారి అధికారులు మాత్రం మిన్నకుండి చోద్యం చూస్తున్నారు తప్ప సంబంధిత కాంట్రాక్టర్‌పై మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. ఇక ప్రజా ప్రతినిధులు కూడా రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు దండుకున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అందుకే ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని కొందరు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు స్పందించి జాతీయ రహదారిపై నెలకొన్న సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


# గూడెం'లో వింత వాతావరణం








**- ఒకే రోజు మూడు కాలాలు..**





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**24 గంటల సమయంలో మూడు కాలాలు కొత్తగూడెం పట్టణ ప్రజలను పలకరించాయి. ఉదయం దట్టమైన మంచు.. మధ్యాహ్నం భగభగ మండే ఎండ.. సాయంత్రం కుండ పోత వర్షంతో ఒకేరోజులో మూడు కాలాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వర్షాకాలం ముగిసి శీతాకాలంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగతో మంచు కురవగా వాహనదారులు రహదారులపై లైట్లు వేసుకుని ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇక మధ్యాహ్నం సమయానికి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ఎండాకాలాన్ని తలపించి భగభగమండుతూ పట్టణ ప్రజలను ఉక్కపోతలో ముంచెత్తాడు. ఇక సాయంత్రం 4 గంటల సమయంలో వాతావరణం మొత్తం ఒక్కసారిగా మారిపోయింది. దట్టమైన మేఘాలు కమ్ముకొచ్చి ఉన్నట్లుండి ఉరుములతో కూడిన జోరు వాన కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆదివారం వారపు సంతలో వ్యాపారస్తులు గొడుగులు వేసుకుని వ్యాపారాలు చేయాల్సి వచ్చింది. ఏది ఏమైనా ఒకేరోజులో మూడు కాలాలను తలపించేలా వింత వాతావరణం నెలకొనడంతో పట్టణ ప్రజలు ఇదేమి కాలంరాబాబు అనుకున్నారు.

## ప్రభుత్వం గీత కార్మికులకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి



**చర్చ :- కరీంనగర్** కల్లుగీత కార్మిక సంఘం కరీంనగర్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గీత కార్మికులకు మీరిచ్చిన హామీలన్నా అమలు చేయాలని ముఖ్యమంత్రికి, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చాము, ఎక్స్‌గ్రేషియా బాధితులే స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు చేశారు అయినా ప్రభుత్వానికి సోయి కూడా లేదని అన్నారు.బ్రతుకుతెరువు కోసం ప్రమాదకరమైనప్పటికీ గీత కార్మికులు తాడి చెట్లు ఎక్కుతున్నారు. ఇంటికి పెద్దదిక్కు చనిపోతే కుటుంబం ఆగమైపోతుంది. శాశ్వత వికలాంగులైతే కుటుంబం మొత్తం నరకయాతన అనుభవిస్తున్నారు. వీరికి ఇస్తామన్న ఎక్స్‌గ్రేషియా ఏండ్ల తరబడి పెండింగ్ లో పెడుతున్నారు.ఇట్ల చేస్తే ఈ ప్రభుత్వానికి వీళ్ళ ఉసురు తగులుతుందన్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు ఏడాది గడిచినా ఇరవై వేలు మించ లేదని ఈ విధంగా ఇస్తే 10 ఏళ్లు గడిచినా అందరికీ అందవని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి చేసే వారందరికీ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు,ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు, మద్యం షాప్ టెండర్లలో 25 % పెంచాలని డిమాండ్ చేశారు. సాఫ్ట్ డ్రింకులను ఉత్పత్తి చేసే బడా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు ప్రజల నుండి దండుకుంటున్నాయని అన్నారు. దేశీయ వస్తువులనే వాడండని ప్రధాని మోడీ గారు చెబుతున్నారు. పక్కా ఆర్గానిక్, ప్రకృతి పానీయం నీరా మరియు కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని అన్నారు. ఇన్ని ఏండ్ల లో కేంద్ర బీజేపీ సర్కార్ ఒక్క పథకమైనా గీత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. తామే పెంచిన జీఎస్టీ ని తగ్గించి ప్రజలు పండుగ చేసుకోండని ప్రధాని అంటున్నారు. నిరుపేదలైన వారందరికీ ఇంటికి 20 లక్షలు ఇవ్వండి అప్పుడు సంబరంగా పండుగ చేసుకుంటామని రమణ అన్నారు.స్వయం సహాయక సంఘాల సభ్యులని కోటీశ్వరులను చేస్తామంటున్నారు కల్లుగీతసొసైటీ సభ్యులు స్వయం పోషకంగా జీవిస్తున్నారు కదా వీరి గురించి ఎందుకు ఆలోచించరని వారు ప్రశ్నించారు.వృత్తిని ఆధునికరించి, నీరా తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెట్ల పెంపకాకి సొసైటీ కి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇచ్చి హైబ్రిడ్ తాటి ఈత వనాలు పెంచాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభిం చాలని ప్రతి జిల్లాలో ఈ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నా రు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్, జగిత్యాల జిల్లా కన్వీనర్ గర్వందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహం, ప్రేమ, ఐక్యత పరిమళం వెదజల్లే పండుగే ఓనం

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**






**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 5 (చర్చ )** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, 125 - గాజులరామారం డివిజన్ పారడైజ్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం మలయాలీస్ వెల్ఫేర్ సొసైటీ, జీడిమెట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ ఓనమ్ సెలబ్రేషన్స్ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మనం ఎక్కడ నివసిస్తే అక్కడే. పుట్టిన ప్రాంతాన్ని మరువకుండా ఇక్కడ ఓనం పండుగ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్నేహం, ప్రేమ, ఐక్యత పరిమళం వెదజల్లే పండుగే ఓనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మలయాలీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కె. కె.పొన్నప్పన్, వైస్ ప్రెసిడెంట్ లాలూ కుట్టన్, జనరల్ సెక్రెటరీ పి. కె.రమేష్, జాయింట్ సెక్రెటరీ సునీల్ సూరారం, ట్రెజరర్ ఈఎం.బైజు, అడ్వైజర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సునీల్ షాపూర్ నగర్, సునీల్ సూరారం, బిజు, సీఎన్. రాజు, శిజు, ప్రదీప్, డానియల్, ప్యాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంజయ్, అడ్వకేట్ కమలాకర్, ప్రభాకర్, చిన్నా చౌదరి, తారా సింగ్, మహేష్, నవీన్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బీజేపీదే పైచేయి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి
- జిల్లాలో అన్ని స్థానాల బరిలో బిజెపి అభ్యర్థులు
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు.



**చర్చ, ఖమ్మం:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తన బలాన్ని నిరూపించి, ప్రతి గ్రామంలో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో మండల, జిల్లా నాయకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరేయడం లక్ష్యంగా ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామీణ ప్రజలకు అందిస్తున్న పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో వార్డు సభ్యుల నుండి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ ఆధిపత్యం సాధించాలంటే కార్యకర్తలే పార్టీకి బలమని, వారి శ్రమతోనే విజయం సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయిలో కమిటీలను తక్షణం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో బూత్ వారీగా కార్యకర్తలను సమన్వయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే హామీలన్నీ విఫలమై ప్రజలను మోసం చేసిందని, ఇక ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు బీజేపీ పోటీ చేయనుందని ప్రకటించారు. ఈ సారి ఖమ్మం జిల్లాలో అత్యధిక స్థానాల్లో కాషాయ జెండా ఎగురనుందని జోస్యం చెప్పారు. ఇవి రమేష్ కన్వీనర్గా నిర్వహించిన ఈ సమావేశంలో బీజేపీ నేతలు గంట్యాల విద్యాసాగర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, సన్నీ ఉదయ ప్రతాప్, మందడపు సుబ్బారావు, నున్న రవికుమార్ , పుల్లారావు యాదవ్, డాక్టర్ శీలం పాపారావు, నంబూరి రామలింగేశ్వర రావు,వీరెల్లి రాజేష్, వేల్పుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షల చెక్కు అందచేత

- ముందుజాగ్రత్తగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలి: బ్యాంక్ మేనేజర్ చందూలాల్



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద రూ.10 లక్షల చెక్కును ఎస్‌బీఐ ఏజీఎం సత్యనారాయణ చేతులమీదుగా అందచేశారు. ఆదివారం విద్యానగర్ కాలనీ ఎస్‌బీఐ బ్రాంచిలో జరిగిన కార్యక్రమంలో మేనేజర్ చందులాల్ మాట్లాడుతూ విద్యానగర్ కాలనీకి చెందిన దేశభోయిన శ్రీనివాస్ స్కూల్‌బస్ క్లీనర్ గా పనిచేస్తున్నారని, మూడు నెలల క్రితం తమ బ్రాంచిలో రూ.500తో యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ చేశారని తెలిపారు. ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌లో శ్రీనివాస్ చనిపోగా అతని భార్య రాజకుమారి బ్రాంచిని సంప్రదించగా ఇన్సూరెన్స్ కవరేజ్ రూ.10 లక్షలు అందచేసినట్లు తెలిపారు. ఎస్బిఐ బ్యాంక్ నందు అత్యుత్తమ ఇన్సూరెన్స్ కవరేజీ అందిస్తుందని తెలిపారు. ముందు జాగ్రత్తతో ఇన్సూరెన్స్ చేయించుకుంటే కుటుంబానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమములో ఫీల్డ్ ఆఫీసర్ తిరుమలేశ్, క్యాష్ ఆఫీసర్ ఇందిరా, అసోసియేట్ కోటేశ్వరి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీకి పోరుబాట పట్టాల్సిందే


- బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీసీ ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకుల సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**చర్చ, హైదరాబాద్:** బీసీ కులాల వారందరూ ఐకమత్యంతో పోరాడితేనే న్యాయమైన హక్కులు, రాజ్యాధికారంలో సముచితమైన వాటా దక్కించుకోగలుగుతామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ నందు పొందుపర్చిన తర్వాతే రిజర్వేషన్స్ పెంపుదల సాధ్యమవుతుందని తెలిసి కూడా కాంగ్రెస్ నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. బీసీ ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకుల సమావేశం హైదరాబాద్ అశోకా హోటల్‌లో ఆదివారం జరిగింది .ఈ సమావేశంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ల ఆంజనేయులు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్టా మధుకర్, బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, బీసీ నాయకులు జనార్ధన్, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశంలో రేపోమాపో ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోవడం పొరపాటు అన్నారు. ఎన్నికలలో ఏ విధంగానైనా గెలవాలనే కుయుక్తులతో కాంగ్రెస్ అమలు కాని హామీలెన్నో ఇచ్చి ప్రజలను నమ్మించి, తీరా అధికారం చేపట్టాక మోసగిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పులి మీద స్వారీ చేస్తున్నారని, ఇక కిందకు దిగడమనేది చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. మేము మునుపటి మాదిరి బీసీలం కాదని, దేశ కాల పరిస్థితులు అర్థం చేసుకుంటున్న తెలివైన వారమని వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ తొలి సమావేశాలలోనే తమ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు బీసీలు, మహిళలకు 33 శాతం చొప్పున చట్టసభల్లో రిజర్వేషన్స్ ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని కేంద్రానికి గుర్తు చేస్తూ తీర్మానించి పంపడం జరిగిందన్నారు. స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాలలో 42%, చట్టసభల్లో మహిళలతో పాటుగా 33% చొప్పున రిజర్వేషన్స్ సాధించుకోవాలంటే అశోకా హోటల్‌లో, ఇందిరాపార్క్ వద్ద ధర్నాలతో సాధ్యపడదని, మన కార్యక్షేత్రాన్ని ఢిల్లీకి మార్చి పోరుబాట పట్టాల్సిందేనని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు. రిజర్వేషన్స్ పెంపుదల, రాజ్యాధికారంలో సరైన వాటా కోసం ఢిల్లీలో పలుమార్లు జరిగిన సభలు, సమావేశాల ఏర్పాట్లను తాను దగ్గరుండి చూసుకున్నానని, కాంగ్రెస్ నాయకులు ఇక్కడ ఎన్ని మాటలు చెప్పినా, కుప్పిగంతులు వేసినా ఏ మాత్రం ప్రయోజనం లేదని, పార్టీ అధినేత రాహూల్ గాంధీపై వత్తిడి పెంచి పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టించడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి 100 మందికి పైగా, ఇండియా కూటమికి 300 మందికి పైగా ఎంపీలు ఉన్నారని, ప్రధాని నరేంద్రమోడీని రాహూల్ గాంధీ కలిసి బిల్లు పార్లమెంటులో పెడితే బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ వద్దిరాజు చెప్పారు. దేశవ్యాప్తంగా బీసీలలో చైతన్యం పెరిగిందని బీజేపీ కూడా గుర్తించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా చట్టసభల్లో కూడా రిజర్వే షన్స్ సాధించుకునేందుకు గాను మనమంతా మరింత సంఘ టితమై కేంద్రంపై ఒత్తిడి పెంచుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులందరూ చేయిచేయి కలిపి అభివాదం చేశారు. 'వర్థిల్లాలి వర్థిల్లాలి బీసీల ఐక్యత వర్థిల్లాలి', 'పోరాడు దాం పోరాడుదాం మన న్యాయమైన హక్కుల సాధనకు పోరాడు దాం', 'జై బీసీ జైజై బీసీ' అంటూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు.


# దివంగత నేత జి వెంకటస్వామి జన్మదిన వేడుకల్లో.

- తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**చర్చ ప్రతినిధి నల్గొండ జిల్లా.** దివంగత నేత , స్వర్గీయ శ్రీ జి . వెంకటస్వామి ( కాకా) గారి జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద కాకా గారి విగ్రహానికి పూలమాల వేసి , తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" పేద ప్రజల అభ్యున్నతి కోసం జి. వెంకటస్వామి గారు ఎంతో కృషి చేశారని ఆయన తెలిపారు. కార్యకర్త స్థాయి నుండి ఎదిగిన ఆయన జీవితం అందరికి ఆదర్శనియమని ఆయన చెప్పారు . రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాల్లో కీలక పదవులు చేపట్టిన ఆయన ఆ పదవులకే వన్నె తెచ్చారని వివరించారు. కాకా గారి ఆశయాలకు అనుగుణంగా ఆయన కుమారులు వినోద్ , వివేక్ మనవడు వంశీకృష్ణ గార్లు ప్రజా సంక్షేమం కోసం పని చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి అభినందించారు.

# వ్యక్తి ఆత్మహత్య



**చర్చ, పినపాక:** అశ్వాపురం మండలం అమెర్ధ కాలనీకి చెందిన కిషోర్ (29) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కిషోర్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

# స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధం కండి

- కంచర్ల భూపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే.




**చర్చ. ప్రతినిధి నల్గొండ జిల్లా** నల్లగొండ కే బి ఆర్ క్యాంపు కార్యాలయంలో..మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. తిప్పర్తి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సమావేశంలో కంచర్ల మాట్లాడుతూ.. ప్రజల కోసం పార్టీ కోసం నమ్మకంగా పనిచేసే సమర్థులైన వ్యక్తులను పార్టీ అభ్యర్థులుగా... సూచించాలని, ఈ సందర్భంగా హాజరైన కార్యకర్తలను నాయకులను కోరారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవని, వారిని నమ్మి పార్టీ చేతుల్లో పెడితే తీరా అసెంబ్లీ ఎన్నిక సమయంలో వెన్నుపోటు పొడిచి పార్టీకి ద్రోహం చేశారని. ఈసారి అలా మోసపోకుండా పార్టీ నమ్మకమైన వ్యక్తులను అభ్యర్థులుగా నియమించుకోవాలని కోరారు. రాష్ట్రప కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రజల్లో చులకన అయిందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో... నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి తండు సైదులు గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు లొడంగి గోవర్ధన్, గోదావరి గూడెం మాజీ ఎంపీటీసీ ఊట్కూరు సందీప్ రెడ్డి, తండు నరసింహ,, కందుల లక్ష్మయ్య, రైతు బంధు కమిటీ జిల్లా కమిటీ మాజీ సభ్యురాలు వనపర్తి జ్యోతి మహిళా అధ్యక్షురాలు కోంద్ర స్వరూప, పార్టీ కార్యదర్శి వనపర్తి నాగేశ్వరరావు, ఉద్యమ నాయకుడు శిరసవాడ సైదులు, కంచర్ల విజయ, కొమ్మగిరి, తదితరులతో పాటు భారీ ఎత్తున మండల ముఖ్య నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజావాణి కార్యక్రమం రద్దు

**చర్చ:- కరీంనగర్** కరీంనగర్ కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నేడొక ప్రకటనలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసేంతవరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ ప్రకటనలో వెల్లడించారు.

# దసరా రిటర్న్ జర్నీ

- హైదరాబాద్-విజయవాడ హైవేపై రద్దీ.




**హైదరాబాద్, అక్టోబర్ 5(చర్చ ):** హైదరాబాద్–విజయవాడ 65వ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. దసరా సెలవులు ముగియడంతో రిటర్న్ జర్నీతో హైదరాబాద్ వైపు వాహనాలు బారులు తీరాయి. కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఒకదాని వెంట మరొకటి నిలిచిపోయాయి. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ ఏర్పడింది. ఈ మేరకు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలు నిదానంగా సాగుతున్నాయి. మరోవైపు ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసిపోయాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు. దసరా సెలవులు ముగియడంతో.. గ్రామాల నుంచి ప్రజలు హైదరాబాద్ నగరానికి తిరిగివస్తున్నారు. బస్టాండ్, స్టాప్ పాయింట్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ బస్టాండ్ వద్ద ప్రయాణికులు బస్సులు కోసం పడిగాపులు కాస్తున్నారు. ఉద్యోగులకు దసరా సెలవులతోపాటు వీకెండ్ కూడా కలిసి వచ్చింది. దీంతో ఇవాళ (ఆదివారం) నగరానికి చేరుకుని రేపు(సోమవారం) ఆఫీస్‌లకు వెళ్లాలనే ఆలోచనతో అందరూ ఒకేసారి హైదరాబాద్ నగరానికి తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ నగరానికి వచ్చే అన్ని రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి.

# స్థానిక ఎన్నికల సన్నాక సమావేశం

-స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉంది - డా"నాగం వర్షిత్ రెడ్డి





_ నల్గొండ బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డా"నాగం వర్షిత్ రెడ్డి గారి అధ్యక్షతన స్థానిక ఎన్నికల సన్నాక సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథులుగా నల్గొండ జిల్లా ఎన్నికల ఇంచార్జ్, మాజీ భువనగిరి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ గారు హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ విజయం సాధించాలని కోరారు. మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు నెరవేర్చలేక ప్రజలను మభ్యపెట్టి ఈరోజు మరల స్థానిక ఎన్నికలకు ఏ ముఖంతో వస్తున్నారని, వారిని ఎన్నికల్లో ఓడించాలని ఈరోజు గ్రామాలలో పాలక వర్గాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనం వల్ల రైతులకు యూరియా కొరత ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వలన15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు వెనక్కు వెళ్ళాయని, ఈరోజు గ్రామాలకు కేంద్రం నుండి మాత్రమే నిధులు అంది నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.రాబోవు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.కళ్యాణ్ నాయక్ గారు, రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవి కుమార్ గారు, గోలీ మధుసూదన్ రెడ్డి గారు, వీరెల్లి చంద్రశేఖర్ గారు, మాధగోనిశ్రీనివాస్ గౌడ్ గారు, కనుమంత రెడ్డి శ్రీదేవి రెడ్డి గారు, బండారు ప్రసాద్ గారు, పిల్లి రామరాజు గారు, దోనూరు వీరారెడ్డి గారు, సాదినేని శ్రీనివాస్ గారు, నకిరేకంటి మొగిలయ్య గారు, పోతేపాక లింగస్వామి గారు, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి గారు, సజ్జల నాగిరెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వం గీత కార్మికులకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి







**చర్చ :- కరీంనగర్** కల్లుగీత కార్మిక సంఘం కరీంనగర్ జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి వెంకట నరసయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గీత కార్మికులకు మీరిచ్చిన హామీలన్నా అమలు చేయాలని ముఖ్యమంత్రికి, మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, చెవిటి వారి ముందు శంఖం ఊదినట్లే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చాము, ఎక్స్‌గ్రేషియా బాధితులే స్వయంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరాహార దీక్షలు చేశారు అయినా ప్రభుత్వానికి సోయి కూడా లేదని అన్నారు.బ్రతుకుతెరువు కోసం ప్రమాదకరమైనప్పటికీ గీత కార్మికులు తాడి చెట్లు ఎక్కుతున్నారు. ఇంటికి పెద్దదిక్కు చనిపోతే కుటుంబం ఆగమైపోతుంది. శాశ్వత వికలాంగులైతే కుటుంబం మొత్తం నరకయాతన అనుభవిస్తున్నారు. వీరికి ఇస్తామన్న ఎక్స్‌గ్రేషియా ఏండ్ల తరబడి పెండింగ్ లో పెడుతున్నారు.ఇట్ల చేస్తే ఈ ప్రభుత్వానికి వీళ్ళ ఉసురు తగులుతుందన్నారు. ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం ఇస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు ఏదాది గడిచినా ఇరవై వేలు మించ లేదని ఈ విధంగా ఇస్తే 10 ఏళ్లు గడిచినా అందరికీ అందవని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి చేసే వారందరికీ తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు,ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు, మద్యం షాప్ టెండర్లలో 25 % పెంచాలని డిమాండ్ చేశారు. సాఫ్ట్ డ్రింకులను ఉత్పత్తి చేసే బడా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు ప్రజల నుండి దండుకుంటున్నాయని అన్నారు. దేశీయ వస్తువులనే వాడండని ప్రధాని మోడీ గారు చెబుతున్నారు. పక్కా ఆర్గానిక్, ప్రకృతి పానీయం నీరా మరియు కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని అన్నారు. ఇన్ని ఏండ్ల లో కేంద్ర బీజేపీ సర్కార్ ఒక్క పథకమైనా గీత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. తామే పెంచిన జీఎస్టీ ని తగ్గించి ప్రజలు పండుగ చేసుకోండని ప్రధాని అంటున్నారు. నిరుపేదలైన వారందరికీ ఇంటికి 20 లక్షలు ఇవ్వండి అప్పుడు సంబరంగా పండుగ చేసుకుంటామని రమణ అన్నారు.స్వయం సహాయక సంఘాల సభ్యులని కోటీశ్వరులను చేస్తామంటున్నారు కల్లుగీతసొసైటీ సభ్యులు స్వయం పోషకంగా జీవిస్తున్నారు కదా వీరి గురించి ఎందుకు ఆలోచించరని వారు ప్రశ్నించారు.వృత్తిని ఆధునికరించి, నీరా తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెట్ల పెంపకానికి సొసైటీ కి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇచ్చి హైబ్రిడ్ తాటి ఈత వనాలు పెంచాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభిం చాలని ప్రతి జిల్లాలో ఈ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నా రు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్, జగిత్యాల జిల్లా కన్వీనర్ గర్వందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ రైతుల రాష్ట్ర సదస్సు విజయవంతం

**- ఆయిల్ పామ్ రంగంపై పాలకులకు ప్రణాళిక లేదా: జూలకంటి రంగారెడ్డి(ఏ ఐ కె ఎస్ జాతీయ నేత,మాజీ ఎమ్మెల్యే)**

**- పామాయిల్ లో ఆఫ్ టైప్ పాపం ఎవరిది ప్రభుత్వమా: బొంతు రాంబాబు (తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి)**

**- రైతులకు ఆయిల్ ఫెడ్ ఎగ్రిమెంట్ ఇవ్వాలి"**

**- ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలి:తుంబూరు ఉమా మహేశ్వరరెడ్డి (తెలంగాణ ఆయిల్ పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు**

**- వందలాదిగా పాల్గొన్న పలు జిల్లాల బాధిత రైతులు"**














**ఖమ్మం జిల్లా,అక్టోబర్05(చర్చ):** ఆధునిక వాణిజ్య వ్యవసాయ రంగంలో గల ఆయిల్ పామ్ రంగంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళిక లేదా అని ఏఐకెఎస్ జాతీయ నేత,మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాలకులను ప్రశ్నించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని స్వర్ణభారతి(కమ్మ వారి కళ్యాణ మండపం) కళ్యాణ మండపంలో తెలంగాణ ఆయిల్ పామ్ రైతులసంఘం రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఆయిల్ పామ్ రైతుల రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జూలకంటి మాట్లాడుతూ డిల్లీలో నల్ల చట్టాలను ఏడాది పాటు పోరాటం చేసి ప్రాణత్యాగం చేసి రైతాంగం మోదీ ప్రభుత్వం మెడలు వంచి రద్దు చేయించగలిగారన్నారు. ఆయిల్ పామ్ రైతుల వ్యధలు పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ఏఐకెఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.వ్యవసాయ రంగంలో కలుగుతున్న పలు మార్పులకు ప్రభుత్వాలే కారణమని దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ద్రోహం చేసే పద్ధతిలో కార్పొరేట్ కంపెనీల కోసం రైతులను ఉసిగొల్పుతుందన్నారు.అనంతరం తెలంగాణ ఆయిల్ పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి,కొక్కెరపాటి పుల్లయ్య లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు 13 ఉంటే కేవలం ప్రభుత్వ ఆధీనంలో 3 మాత్రమే ఉన్నాయని మిగిలిన 10 కార్పొరేట్ల చేతిలో ఉన్నాయని రైతాంగానికి ద్రోహం చేస్తున్నాయని, అశ్వారావుపేట ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీలలో సామర్థ్యం పెంచాలని తక్షణమే కార్పొరేట్ల చేతిలో ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆయిల్ పామ్ ను ఎక్కువమంది రైతులు సాగుచేయాలని ఉన్న వాటిని తీసివేయవద్దని సూచించారు.పామాయిల్ మొక్కలలో ఆడ మగ కాకుండా ఆఫ్ టైప్ పాపం ఎవరిది ప్రభుత్వమా"ఎందుకు లోపాన్ని నిగ్గు తేల్చరు అని తెలంగాణ రైతు సంఘం ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు తెలంగాణ ప్రభుత్వంపై మండిపడ్డారు. వుమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఆయిల్ పామ్ రైతుల ఆక్రందన ను ఆలోచించకుండా రాజకీయాలు చేయడం తగదని హెచ్చరిం చారు.నష్టపోయిన ఆయిల్ పామ్ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యానవన శాఖలోని పోస్టులు భర్తీ చేయాలని కోరారు.రైతులతో ఆయిల్ పామ్ సాగుచేయిస్తున్న ఆయిల్ ఫెడ్ సంస్థ ఎటువంటి నష్టం వచ్చినా పూర్తి బాధ్యత వహిస్తామని తెలుపుతూ రైతాంగానికి ఎగ్రిమెంట్ లు ఇవ్వాలని పలు జిల్లాల నుండి సదస్సుకు హాజరైన 500 మంది బాధిత ఆయిల్ పామ్ రైతులు కోరారు.త్వరలోనే సమస్యల పరిష్కారం కోసం డిల్లీ లోని పార్లమెంట్ సభ్యులను కలుస్తామని రానున్న శీతాకాల సమావేశా లలో కేంద్రం ఎదుట ఏకరువు పెట్టేలా కోరనున్నామని ఉమా మహేశ్వరరెడ్డి తెలిపారు.ఆయిల్ పామ్ రైతుల రాష్ట్ర సదస్సు విజయవంతం అయ్యిందని రాష్ట్ర కమిటి ప్రకటించింది.ఈ సదస్సులో: దొడ్డ చక్రధర్ రెడ్డి,రావు జోగిబాబు,చెలికాని వెంకట్రావు, వనపర్తి జిల్లా నేత బుచ్చన్న, నల్గొండ జిల్లా నేత గురువారెడ్డి,సూర్యాపేట జిల్లా నేత సంగీతరెడ్డి, చింతనిప్పు చలపతిరావు,ధనమ్మ,పాషా, సత్యనారాయణరెడ్డి,దొడ్డ లక్ష్మీనారాయణ,కొప్పుల కృష్ణయ్య,మోరంపూడి వెంకటేశ్వరరావు ,వారిపల్లి పూర్ణచంద్రరావు,అమరనేని అప్పారావు,యనమద్ది రామకృష్ణ,దొడ్డపనేని కృష్ణార్జున్,సంక్రాంతి పురుషోత్తం,కట్టా రాంబాబు,చావవేణు,యనమద్ది లెనిన్,సంక్రాంతి నర్సయ్య,దుగిని అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో హమాలీ కార్మికుడు వాకిటి రాజు మృతి

**- నివాళులు అర్పించిన మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్**

**- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగల్లు గ్రామ ముదిరాజ్‌లు**

**- రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్**



**చర్చ, వరంగల్:** పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు వాకిటి రాజు ముదిరాజ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. రాజు మతి విషయాన్ని జిల్లా మెపా ఉపాధ్యక్షులు చెట్టబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, గౌరబోయిన అశోక్ ముదిరాజ్‌ల ద్వారా తెలుసుకున్న మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్, ఏనుగల్లు గ్రామ ముదిరాజ్ పెద్దలు చెట్టబోయిన రాములు, నర్ర సూరయ్య, సొసైటీ అధ్యక్షులు తోట రాములు, ఉపాధ్యక్షులు మొద్దు సత్యం ముదిరాజ్‌లతోపాటు కుల సభ్యులు వాకిటి రాజు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు ఇద్దరు కుమార్తెలను, కుమారుడిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ భవనంలో జరిగిన సంతాప కార్యక్రమంలో పులి దేవేందర్ మాట్లాడుతూ ముదిరాజులు కష్టసుఖాల్లో, ఆపదలో ఉన్నప్పుడు అందరూ కలిసి కట్టుగా ఉండాలని, విద్య, ఉద్యోగ సాధికారత కోసం కృషి చేస్తున్న మెపా బాటలో అందరూ నడవాలని అన్నారు. ప్రభుత్వం వాకిటి రాజు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెపా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు చెట్టబోయిన శ్రీనివాస్, చెన్నారావుపేట మండల నాయకులు రోడ్డ కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కష్ణ, మెపా జిల్లా నాయకులు గౌరబోయిన అశోక్, సారంగం, రవి, రాకేష్‌లతో పాటు ఏనుగల్లు కులపెద్దమనిషి చెట్టబోయిన రాములు, నర్ర, సొసైటీ అధ్యక్షులు తోట రాములు, ఉపాధ్యక్షులు మొద్దు సత్యం, సభ్యులు మొద్దు సుధాకర్, వాకిటి యాదగిరి, వాకిటి సుధాకర్, చెట్టబోయిన వెంకన్న, నర్ర చంద్రమౌళి, నర్ర లక్ష్మణ్, నూనె సారంగం, గుండా రాకేష్, ధోని సంపత్, ధోని దేవేందర్, తోట కుమారస్వామి, తోట యాకయ్య, వాకిటి రవి, బిక్షపతి, మారబోయిన రవి, ధోని నరేందర్, వాకిటి సూరయ్య,వాకిటి రమేష్,తోట వీర శేఖర్,హేమ రాజా శేఖర్,వాకిటి నాగరాజు, అనిల్, వాకిటి ప్రదీప్, గుండా హరీష్, రవి, కీసరి రవి, దోని మహేందర్, రంజిత్‌లతో పాటు వివిధ గ్రామాల ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షం కురిస్తే చాలు చెరువులుగా మారుతున్న కాలనీ

**- స్థానిక నాయకులు, అధికారులు స్పందించాలని స్థానికులకు విజ్ఞప్తి**





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:**లక్ష్మీదేవిపల్లి మండలం పరిధిలోని సంజయ్‌నగర్ గ్రామపంచాయతీ హమాలీ కాలనీ సమీపంలోని సరస్వతీ కాలనీలో వర్షం కురిసినప్పుడల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పంపు బాయ్ ఏరియాలో వర్షపు నీరు, మురుగు నీటికి సరైన నిష్క్రమణ దారి లేకపోవడంతో, వర్షం వచ్చినప్పుడు మొత్తం నీరు రోడ్డుపై చేరి చెరువులను తలపించేలా మారుతోంది.దీంతో పాఠశాల విద్యార్థులు, కాలనీవాసులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# ఖమ్మం జిల్లాలో పర్యటించిన మంత్రి పొంగులేటి



**చర్చ, ఖమ్మం:**రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. పాలేరు, ఖమ్మం, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూసుమంచి మండలం రాజుపేట గ్రామంలో కొర్ర రమేష్ నివాసంలో నూతన గృహప్రవేశ వేడుకకు హాజరై దంపతులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఖమ్మం నగరంలోని గుర్రం జగన్మోహన్‌రావు ఫంక్షన్ హాల్‌లో 60వ డివిజన్ కార్పొరేటర్ బద్దె నిరంజన్ కుమారుని పంచెకట్టు వేడుక, అలాగే ఎస్.ఆర్. కన్వెన్షన్‌లో కాంగ్రెస్ నాయకుడు భీమనాధుల అశోక్‌రెడ్డి కుమార్తె ఓణీల అలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. మధిర మండలం ఆత్కూరు గ్రామంలో కంభంపాటి సురేష్ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఇల్లూరులో ఇటీవల వివాహం చేసుకున్న కోట రామారావు కుమారుడు, కోడలిని ఆశీర్వదించారు. మర్లపాడు గ్రామంలో అనారోగ్యంతో మరణించిన యువకుడు లక్ష్మా రెడ్డి కుటుంబాన్ని మంత్రి పరామర్శించి సానుభూతిని తెలిపారు. వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు అట్లూరి సత్యనారాయణరెడ్డి నిర్వహించిన చండీహోమంలో పాల్గొని పూజలు చేశారు. కుంచపర్తి గ్రామంలో కుక్కపల్లి రామకృష్ణ కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన మంత్రి, శంభునిగూడెం గ్రామంలో అర్వపల్లి నరసింహారావు కుమారుని రిసెప్షన్‌లో పాల్గొన్నారు.

# చేపల వేటకుకు వెళ్లి యువకుడు మృతి

**- ప్రమాదమా..? హత్యా..?**

**చర్చ, మణుగూరు:**మద్యం మత్తులో చేపలవేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని పగిడేరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ములుగు జిల్లా మల్లూరు గ్రామానికి చెందిన గోడ చరణ్ (28) మణుగూరు మండలం పగిడేరులో అత్తగారింటికి దసరా పండుగకు వచ్చాడు. చరణ్ స్నేహితులతో కలిసి మద్యం సేవించి సాంబాయిగూడెం పేరంటాల చెరువులో శనివారం రాత్రి చేపలవేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చరణ్ వల విసురుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. చరణ్ ఆచూకీ ఎంతకీ కనిపించకపోవడంతో మిగతా ఇద్దరు స్నేహితులు భయంతో ఇళ్ళకి వెళ్లిపోయారు. భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన భార్య... చరణ్ స్నేహితుల ఇంటికి వెళ్లి నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పడంతో.. స్నేహితులు సుధాకర్, మరొకరితో కలిసి చెరువు దగ్గర ఎంత వెతికినా చరణ్ ఆచూకీలభ్యం కాలేదు. చీకటి కావడంతో ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు రంగంలోకి దిగి గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలించి చరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా చరణ ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతిచెందాడా.. లేక స్నేహితులు హత్యచేసి ప్రమాదంగా చిత్రీకరించి ఉంటారా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ ఆఫీస్ బేరర్స్ సమావేశం ఎంపీ కొండా, ఎమ్మెల్యే కాటిపల్లి ఫైర్

**హైదరాబాద్, అక్టోబరు5:** బీజేపీ తెలంగాణ ఆఫీస్ బేరర్స్ సమావేశం(ఆదివారం) ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. హాట్‌హాట్‌గా ఈ సమావేశం కొనసాగింది. స్థానిక సంస్థల ఎన్నికల వేళ పార్టీలో సమన్వయ లోపంపై మండిపడ్డారు బీజేపీ నేతలు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ అధ్యక్షుల తీరుపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.నేతల మధ్య సమన్వయం లేదు..నేతల మధ్య సరైన సమన్వయం ఎందుకు లేదని ఎంపీ కొండా ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులతో జిల్లా నేతలకు సమన్వయం లేదని మరో ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను అధిగమించి ముందుకెళ్దామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు చెప్పుకొచ్చారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా అంశాలపై కమిటీ వేస్తామని రాంచందర్‌రావు తెలిపారు. ఈ నెల 8వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.త్రీ మెన్ కమిటీ.త్రీ మెన్ కమిటీలో జిల్లా ఇన్‌చార్జి, అబ్జర్వర్, జిల్లా అధ్యక్షుడు సభ్యులుగా కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాల వారిగా బహిరంగ సభలు నిర్వహించాలని



నిర్ణయం తీసుకున్నారు. బహిరంగ సభలకు ముఖ్య అతిథులుగా సునీల్ బన్సల్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ కుమార్‌లు ఉండనున్నారు.ప్రణాళికలు రచించాలి: ఎంపీ డీకే అరుణబహిరంగ సభల బాధ్యత పార్టీ జిల్లాల ఇన్‌చార్జ్‌లకి మాత్రమే అప్పగించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక కోసం ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు, ఇన్‌చార్జ్, అబ్జర్వర్‌తో త్రిసభ్య కమిటీతో జిల్లాల వారీగా బహిరంగ సభలకు ప్లాన్ చేయాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. కనీసం 15 జడ్పీ చైర్మన్‌లు గెలవడమే లక్ష్యంగా బీజేపీ హై కమాండ్ ప్రణాళికలు రచించాలని కోరారు. ఎంపీలు ఉన్న చోట స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా.. మిగతా ప్రాంతాల్లో పార్టీ విస్తరణే లక్ష్యంగా ప్రణాళికలు రచించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు.క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలేవీ: ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిమరోవైపు.. ఈ సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి కూర్చోలేని సమస్య ఎందుకు వస్తోంది..? అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో కూర్చొని కార్యక్రమం డిసైడ్ చేస్తారని.. క్షేత్రస్థాయిలో ఆ కార్యక్రమమే ఎందుకు ఉండదని నిలదీశారు. అలాగే, జిల్లాల్లో పార్టీ నేతల తీరుపై ఎమ్మెల్యే కాటిపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రౌండ్ లెవెల్‌లో పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సమావేశాలకు రావడం, వెళ్లడమే తమ పనా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలేవీ..? అని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రూ.2 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా చెర నుంచి కాపాడిన హైడ్రా

**హైదరాబాద్ :** అత్యంత విలువైన ప్రభుత్వ భూమి అక్రమణల నుంచి విముక్తి పొందింది. శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్ సర్వే నంబరు 59లో ఉన్న 57 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ హైకోర్టు గత నెల 30న కీలక ఉత్తర్వులు జారీ చేయగా.. హైడ్రా అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు భారీ పోలీసు బందోబస్తు మధ్య రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సిబ్బంది ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. కొండాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయం వెనుక భాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో అక్రమంగా వెలిసిన గుడిసెలు, షెడ్లను నేలమట్టం చేశారు. కేవలం నివాస ఆక్రమణలే కాకుండా, స్థానికంగా బోర్లు వేసి ట్యాంకర్లతో నిర్వహిస్తున్న అక్రమ నీటి దందాకు కూడా చెక్ పెట్టారు.హైదరాబాద్‌లోని కొండాపూర్ సర్వే నంబరు 59లో ఉన్న 57 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి విముక్తి చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు శనివారం భారీ బందోబస్తు మధ్య రూ. 2 వేల కోట్ల విలువైన



57 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా వెలిసిన నివాస, వాణిజ్య ఆక్రమణలను తొలగించారు. అంతేకాకుండా ఆర్టీఏ కార్యాలయం చౌరస్తా నుంచి హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, పాన్ దుకాణాలు వంటి వాణిజ్య ఆక్రమణలను కూడా అధికారులు తొలగించారు. ఈ సర్వే నంబర్ 59లో ఉన్న మొత్తం 57 ఎకరాల భూమిలో గతంలో ఆర్టీఏ కార్యాలయానికి 5 ఎకరాలు, సీఆర్ ఫౌండేషన్‌కు 5 ఎకరాలు, వీకర్ సెక్షన్ కాలనీకి 10 ఎకరాలు, శ్మశాన వాటికకు 3 ఎకరాలు కేటాయించారు. మరో 4 ఎకరాల స్థలం రోడ్డు నిర్మాణంలో పోయిందిప్రస్తుతం ఖాళీగా ఆక్రమణలకు గురైన 18 ఎకరాల విలువైన స్థలాన్ని అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి విలువ సుమారు రూ. 2 వేల కోట్ల వరకుఅధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ స్థలం తమదేనని 35 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉందని కొత్తగూడ గ్రామానికి చెందిన కొందరు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, తాము హైకోర్టు ఉత్తర్వుల ప్రకారమే ఈ స్వాధీనం ప్రక్రియ చేపట్టినట్లు స్పష్టం చేశారు. గతంలోనూ హైడ్రా అధికారులు కోట్ల విలువైన ప్రభుత్వభూములను కాపాడి స్వాధీనం చేసుకున్నారు.

# పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

**హైదరాబాద్ :** తెలంగాణలో వారంలోగా సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ విషయంలో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. పత్తి కొనుగోళ్ల అంశంపై శనివారం తన నివాసంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సీసీఐ టెండర్లలో పాల్గొనకపోవడం వల్ల తలెత్తిన సమస్యల పరిష్కారంపై ప్రధానంగా చర్చించారు.వచ్చే వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాల్సిందేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ నెల 6వ తేదీన మరోసారి సీసీఐ సీఎండీ, కాటన్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం కానున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా రైతులు



అనుకున్నంత మేర పంట దిగుబడులు సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ప్రయోజనాలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ప్రభుత్వం ఉపేక్షించదని ఆయన గట్టిగా హెచ్చరించారు.పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో మిల్లర్లు టెండర్లు వేయడానికి ముందుకు రాకపోవడం వెనుక ఉన్న అభ్యంతరాలను మంత్రి వివరించారు. ఈ సమస్యను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. లింట్ శాతం, ఎల్-1 స్లాట్ బుకింగ్ ఏరియా మ్యాపింగ్ వంటి నిబంధనలపై మిల్లర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ అంశాలపై గతంలో రెండు దఫాలు సీసీఐ అధికారులు, మిల్లర్లతో సమావేశాలు నిర్వహించారు. గత సీజన్‌లో అనుసరించిన విధానాలనే ఈ ఏడాది కూడా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సీసీఐకి సూచించింది.దీనిపై స్పందించిన సీసీఐ అధికారులు, ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల్లో ముఖ్యంగా లింట్ శాతం, మరికొన్ని నిబంధనల్లో కొంతమేర సడలింపులు ఇస్తామని, మిగతా నిబంధనలు యథాతథంగా అమలు చేస్తామని మంత్రికి వివరించారు. ఈ చర్యల ద్వారా మిల్లర్లు టెండర్లలో పాల్గొనేలా చేసి, పత్తి కొనుగోళ్లను త్వరగా ప్రారంభించి రైతులకు మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ టికెట్ ఎవరికి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. ముఖ్యంగా ప్రతిష్ఠాత్మకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈ స్థానానికి అభ్యర్థిని ఖరారు చేసే ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుంది.జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం నలుగురు కీలక నేతలతో కూడిన ఫైనల్ జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాను తుది నిర్ణయం కోసం ఏఐసీసీ (అఖిల భారత కాంగ్రెస్ కమిటీ) కి పంపించినట్లు తెలుస్తోంది. షార్ట్‌లిస్టులో ఉన్న పేర్లు పార్టీలో ఉన్న బలమైన బీసీ నేతల ప్రాతినిధ్యాన్ని, స్థానిక పట్టును సూచిస్తున్నాయి.జాబితాలో ఎవరెవరు ఉన్నారంటేనవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్ అండ్ అంజన్‌కుమార్ యాదవ్. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం, ఎందుకంటే ఇది హైదరాబాద్ నగరంలో పార్టీ పట్టును



మరింత పటిష్ఠం చేస్తుంది.బఇక జూబ్లీహిల్స్‌లో ప్రధాన ప్రత్యర్థిగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఉంది. గత ఎన్నికలలో ఈ స్థానాన్ని గెలుచుకున్న బీఆర్ఎస్, ఈసారి కూడా తమ ప్రాబల్యాన్ని నిలుపుకోవాలని చూస్తోంది.దీనిలో భాగంగానే బీఆర్ఎస్ నుంచి మాగంటి ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై నెలకొన్న న్యాయ వివాదం కారణంగా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత పెరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడం.. ఈ ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం చూపుతుందనే ఆందోళన ఉంది. ఈ నేపథ్యంలో.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఢిల్లీ పర్యటనకు వెళ్లడం అత్యంత ముఖ్యమైన పరిణామం. వారు ఢిల్లీలోని సీనియర్ న్యాయవాదులను కలిసి, సుప్రీంకోర్టులో ఈ రిజర్వేషన్ల అంశంపై బలమైన వాదనలు వినిపించేలా చర్చలు జరుపుతారు. బీసీలకు అధిక రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా.. స్థానిక ఎన్నికలలో ఆ వర్గం మద్దతును గెలుచుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

# 94 వైన్ షాపుల కొరకు కేవలం ఒక్కటే దరఖాస్తు ఎక్కడంటే

**కరీంనగర్ జిల్లా :** కరీంనగర్ జిల్లా లో 94 వైన్ షాపుల లైసెన్స్‌ల కోసం ఎక్సైజ్ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌కు వ్యాపారుల నుంచి స్పందన కరువైంది. తొమ్మిది రోజుల్లో కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే అందింది. రూ. 3 లక్షల దరఖాస్తు ఫీజు పెంపు, బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు కారణంగా స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉన్న సందేహాలే ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ నెల 18 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. తెలంగాణ రాష్ట్రంలో మద్యం దుకాణాల కొత్త లైసెన్స్‌ల జారీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో.. ఎక్సైజ్ శాఖ అంచనాలకు భిన్నంగా దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ పరిస్థితికి అనేక రాజకీయ, ఆర్థిక కారణాలు ఉన్నాయని తెలుస్తోంది.కరీంనగర్లో మద్యం లైసెన్స్‌లకు తగ్గిన స్పందనకరీంనగర్ ఎక్సైజ్ శాఖ జిల్లా పరిధిలోని మొత్తం 94 వైన్ షాపుల నిర్వహణ కోసం సెప్టెంబర్ 26న నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే.. తొమ్మిది రోజుల గడువు ముగిసినప్పటికీ, శనివారం వరకు కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే అందింది. ఇల్లందకుంటలో గెజిట్ నంబర్ 93 కోసం ముష్యం కాశీనాథం అనే వ్యక్తి రూ. 3 లక్షల చలాన్‌తో లైసెన్స్ కోసం దరఖాస్తు సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణకు అక్టోబర్ 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉన్నప్పటికీ, వ్యాపారులు వేచి చూసే ధోరణిని అనుసరిస్తున్నారు. దీనికి



ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని అధికారులు, విశ్లేషకులు భావిస్తున్నారు.ఫీజు పెరుగుదల:గతంలో రూ. 2 లక్షలు ఉన్న దరఖాస్తు ఫీజును ఈసారి రూ. 3 లక్షలకు పెంచారు. ఈ మొత్తం, లైసెన్స్ దక్కినా దక్కకపోయినా తిరిగి చెల్లించరు. దరఖాస్తుదారులపై ఈ అదనపు ఆర్థిక భారం పడటం కూడా స్పందన తగ్గడానికి ఒక కారణంగా భావిస్తున్నారు.స్థానిక ఎన్నికల ఉత్కంఠ:స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటికీ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అక్టోబర్ 6న న్యాయస్థానం ఇచ్చే తీర్పు కోసం వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చి, డిసెంబర్ 1లోగా ఎన్నికలు పూర్తయితే.. కొత్త లైసెన్స్‌దారులకు (2025-27 కాలానికి) స్థానిక ఎన్నికల సమయంలో మద్యం అమ్మకాలు ఉండవని.. దీనివల్ల వ్యాపారంపై ప్రభావం పడుతుందనే సంశయం కొందరిలో ఉంది.కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ అర్బన్ (21), కరీంనగర్ రూరల్ (26), తిమ్మాపూర్ (14), హుజురాబాద్ (17), జమ్మికుంట (16) ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో మొత్తం 94 వైన్స్ ఉన్నాయి. వీటిలో ఎక్సైజ్ ట్యాక్స్ ఆధారంగా రూ. 50 లక్షలు (11), రూ. 55 లక్షలు (40), రూ. 65 లక్షలు (43) పరిధిలోని దుకాణాలు ఉన్నాయి.సామాజిక రిజర్వేషన్ల విషయానికొస్తే.. ఈ 94 వైన్స్‌లో గౌడ కులస్థులకు 17 షాపులు, షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వారికి తొమ్మిది షాపులు రిజర్వ్ చేశారు. ఈ కోటా ద్వారా దరఖాస్తు చేసే వారు.. స్థానిక ఎన్నికల వ్యవహారం తేలిన తర్వాత దరఖాస్తు చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటిని కరీంనగర్‌లోని అర్బన్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలోని ఐదు ప్రత్యేక కౌంటర్లలో, లేదా హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కూడా సమర్పించవచ్చు. లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియ అక్టోబర్ 23వ తేదీన కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో లాటరీ ద్వారా జరుగుతుంది.

# ఏసీబీ కస్టడీకి ఏడీఈ అంబేడ్కర్ పర్మిషన్ ఇచ్చిన కోర్టు



**హైదరాబాద్:** ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో విద్యుత్ శాఖ మాజీ ఏడీఈ అంబేద్కర్ అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడా జైలులో ఉన్నారు. అతడిని ప్రశ్నించేందుకు అవకాశం కల్పించాల్సిందిగా ఏసీబీ అధికారులు పిటిషన్ వేశారు. పిటిషన్‌ను విచారించిన ఏసీబీ కోర్టు అందుకు అనుమతి ఇచ్చింది. నాలుగు రోజుల కస్టడీకి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.సోమవారం నుంచి నాలుగు రోజులపాటు అంబేద్కర్‌ను ఏసీబీ అధికారులు విచారించబోతున్నారు . సెప్టెంబర్ 16న అంబేద్కర్ నివాసంతోపాటు కార్యాలయాలు, బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అంబేద్కర్‌కు సంబంధించిన ప్లాట్లు, భవనాలు, భూములను అధికారులు గుర్తించారు. అంబేద్కర్ ఆస్తులకు బహిరంగ మార్కెట్లో సుమారు రూ.200 కోట్లకు పైగా విలువ ఉన్నట్టు గుర్తించారు. ఇబ్రహీం బాగ్, నార్సింగి, మణికొండ ప్రాంతాలలో అంబేద్కర్ విద్యుత్ శాఖ ఏఈ, ఏడీగా విధులు నిర్వర్తించారు.నిందితుడికి సంబంధించిన వ్యక్తి ఇంట్లో రెండు కోట్ల రూపాయల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టినట్టు తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. దీంతో అంబేద్కర్‌ను విధుల నుంచి విద్యుత్ శాఖ తొలగించింది. నాలుగు రోజుల కస్టడీలో ఆస్తులు, ఇతర అంశాలపై అంబేద్కర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించనున్నారు.

# పాంగోలిన్ స్కేల్స్ అక్రమ రవాణా చేస్తున్న ముఠా గుట్టురట్టు

**హనుమకొండ, అక్టోబరు5:** హనుమకొండ లో హైదరాబాద్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు (ఆదివారం) సోదాలు నిర్వహించారు. అక్రమంగా అలుగు పొలుసులని (పాంగోలిన్ స్కేల్స్) రవాణా చేస్తున్న నలుగురు నిందితులని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి మొత్తం 6.53 కిలోల అలుగు పాంగోలిన్ స్కేల్స్‌ని సీజ్ చేశారు పోలీసులు. అలుగులని వేటాడి వాటి చర్మంపై ఉండే పొలుసులని వేరు చేస్తున్నారు నిందితులు. వీటికి భారీ డిమాండ్ ఉండటంతో ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి చేస్తున్నారు నిందితులు. ఔషధాల తయారీలో ఈ అలుగు పొలుసులని వినియోగిస్తున్నారు. వైల్డ్ లైఫ్ చట్టం ప్రకారం అలుగులని వేటాడటం నేరమని పోలీసులు హెచ్చరించారు. డీఆర్ఐ అధికారులు నలుగురు నిందితులని అదుపులోకి తీసుకొని హనుమకొండ అటవీ అధికారులకు అప్పగించారు.




# కాంగ్రెస్ అంటేనే మోసం! మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మండిపడ్డారు. మంథని పట్టణంలోని రాజగృహాలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ బాకీ పడ్డ హామీలను "కాంగ్రెస్ బాకీ కార్డు"తో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిద్దామన్నారు. ఎన్నికలకు ముందు అలవికాని ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఇచ్చి, అధికారం చేపట్టిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని 22 నెలలు గడుస్తున్నా ఒక్క పథకమూ సక్రమంగా నెరవేర్చకుండా.. వాటి ఊసే ఎత్తకుండా ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది అని ధ్వజమెత్తారు.అడ్డగోలు హామీలతో, అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, కాంగ్రెస్ ఒక్కొక్కరికి ఎంత బాకీ ఉందో చెప్పడానికి ఈ "కాంగ్రెస్ బాకీ కార్డు" బ్రహ్మాస్త్రంలా పని చేస్తుంది. ఈ కాంగ్రెస్ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పిలుపునిచ్చారు.



# హైదరాబాద్ -విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్



**హైదరాబాద్ :** దసరా సెలవులు ముగియడంతో.. గ్రామాల నుంచి హైదరాబాద్ నగరానికి ప్రజలు తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్ నగరానికి వచ్చే అన్ని రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. మరి ముఖ్యంగా హైదరాబాద్ %-% విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. కిలోమీటర్ల మేర వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రయివేటు వాహనాలు ఒకదాని వెంట మరొకటి బారులు తీరాయి. దీంతో చిట్యాల, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదులుతున్నాయి. మరోవైపు ప్రయాణికులతో ఆర్టీసీ, ప్రయివేటు బస్సులు కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.


## అక్రమ కట్టడాలు, లేఔట్‌లు నిర్మిస్తే కూల్చివేస్తాం



**నెల్లూరు:** గూడూరు మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేలకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమృత్ పథకం ద్వారా పదివేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ పథకం ద్వారా గూడూరుకు రూ.73 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలకు అమృత్ పథకం కింద నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. రాష్టంలో ఉన్న పనికిరాని డ్రైనేజీలను పూడ్చుడానికి రూ.28 వేల కోట్ల ఖర్చు అవుతుందని వివరించారు. మొదటి విడతగా రూ.4 వేల కోట్ల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు, లేఔట్‌లు నిర్మిస్తే కూల్చివేస్తామని మంత్రి నారాయణ హెచ్చరించారు.

## శ్రీశైలం ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్

**అమరావతి, అక్టోబరు5:** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధి పై దేవాదాయ, అటవీశాఖలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ఆదివారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన దివ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆలయ సమగ్రాభివృద్ధిపై చర్చించారు. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నందున వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు సీఎం చంద్రబా బు.తిరుమల తరహాలోనే శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేలా కార్యా చరణకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆధ్యాత్మికంగా, పర్యాటక ప్రాంతంగా, పర్యావరణ పరంగా శ్రీశైలం ప్రాంతాన్ని అభివృద్ధి



చేసేలా ప్రణాళికలు రచించాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. దేవాలయ అభివృద్ధి కోసం 2 వేల హెక్టార్ల భూమిని దేవాదాయశాఖకు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి జాతీయ రహదారులను అనుసంధానించేలా ప్రణాళికలు చేయాలని ఆదేశించారు సీఎం చంద్రబాబు.శ్రీశైలంలోని పులుల అభయారణ్యం అభివృద్ధికి పలు సూచనలు చేశారు సీఎం చంద్రబాబు. భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్న కారణంగా ఆలయ సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు అవసరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్న సందర్భంగా సౌకర్యాలు విస్తరించాలని పవన్ కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు. శబరిమలతో సహా ఇతర ప్రముఖ దేవాలయాల్లో సౌకర్యాలను పరిశీలించి శ్రీశైలాన్ని అభివృద్ధి చేద్దామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## ప్రతి 3 బాటిళ్లలో ఒకటి కల్తీ మందే
## వైఎస్ జగన్ సంచలన ఆరోపణలు

**అమరావతి, అక్టోబరు5:** ఏపీలో కల్తీ లిక్కర్‌పై సీఎం చంద్రబాబు నాయుడిపై మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిప్పులు కురిపించారు. చంద్రబాబు గారూ.. మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన మీరు, ఇప్పుడు నకిలీ లిక్కర్ వ్యవహారంలోనూ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నట్టున్నారని విమర్శిం చారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో మీ పార్టీ నాయ కులు ఏకంగా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేసిన ఘటన రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తో ందని అన్నారు. రాష్ట్రానికి సంపద పెరగడం సంగతేమోకాని, లిక్కర్ సిండికేట్లతో, నకిలీ మద్యం తయారీల ద్వారా, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మీ పార్టీ నాయకులు గడించిన అక్రమ సంపాదనను పైనుంచి కిందివరకూ వీరంతా పంచుకుంటు న్నారని విమర్శించారు. వ్యవస్థీకృతంగా ఈ దందా కొనసాగు తోందని ఆరోపించారు.మీ లిక్కర్ సిండికేట్లకు, గ్రామస్థాయి వరకూ విస్తరించిన బెల్టుషాపుల మాఫియాలకు, కల్తీ మద్యం వ్యాపారానికి అడ్డురాకూడదనే ఉద్దేశంతోనే ఒక వ్యూహం ప్రకారం మీరు ప్రభుత్వ మద్యం దుకాణాలపై విష ప్రచారం చేశారని వైఎస్ జగన్ అన్నారు. ఉద్దేశపూర్వకంగా వాటిని తీసివేసి, వాటి స్థానంలో మీ సిండికేట్లకు అప్పగించారని అన్నారు. మద్యం దుకాణాలు టీడీపీ వాళ్లవే అని తెలిపారు. బెల్టుషాపులు టీడీపీ వాళ్లవే అని పేర్కొన్నారు. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు టీడీపీ వాళ్లవే అని ఆరోపించారు. అక్రమ మద్యం తయారీ దారులు కూడా టీడీపీ నేతలే అని.. వాళ్లు తయారుచేస్తారు, ఆ తయారు చేసిన దాన్ని మీ వాళ్లే, మీ షాపులద్వారా, మీ బెల్టుషాపుల ద్వారా అమ్ముతారని తెలిపారు. అలా వచ్చిన డబ్బును వాటాలు వేసుకుని పంచుకుంటారన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి



కల్తీ మద్యమేనన్న వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయని మండిపడ్డారు.లిక్కర్ వ్యవహారంలో మీ వ్యవస్థీకృత నేరాల ద్వారా ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదం ఏర్పడ్డమే కాదు, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన డబ్బును మీరు దోచుకుంటున్నారని ఆరోపించారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దుచేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలను పెంచారని అన్నారు. మార్టులు పెట్టారు, తిరిగి మళ్లీ ఇల్లీగల్ బెల్టుషాపులు తెరిచారు, ప్రతి వీధిలోనూ పెట్టారు, రాత్రిపగలు తేడాలేకుండా లిక్కర్ అమ్మడం మొదలుపెట్టారు. ఇల్లీగల్ పర్మిట్ రూమ్‌లు తెరిచారని మండిపడ్డారు. ఇంత విచ్చలవిడిగా తాగిస్తున్నా సరే, నివేదికల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఐదు నెలల్లో, అంటే ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే లిక్కర్ అమ్మకాలు ఉన్నప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం ?6,782.21 కోట్లు కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఐదు నెలల్లో, విచ్చలవిడిగా లిక్కర్ అమ్మినా సరే ఆదాయం ?6,992.77 కోట్లు మాత్రమే వచ్చిందని అన్నారు.. కేవలం 3.10% వృద్ధి మాత్రమే ఉందన్నారు. ఎక్కడైనా ప్రతిఏటా సహజంగా వచ్చే 10% పెరుగుదల కూడా రాలేదని.. అంటే దీని అర్థం, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని, సిండికేట్ల రూపంలో, కల్తీ లిక్కర్ తయారీ రూపంలో మీ ముఠా కొట్టేస్తున్నట్టేగా అర్థమని ప్రశ్నించారు.కల్తీ లిక్కర్ వ్యవహారాలు కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయని వైఎస్ జగన్ తెలిపారు. ఉత్తరాంధ్రలోనూ, గోదావరి జిల్లాల్లోనూ, ఇప్పుడు రాయలసీమలోనూ ఈ ఘటనలు బయటకు వచ్చాయన్నారు. కానీ విచారణ, దర్యాప్తు తూతూ మంత్రంగానే సాగుతున్నా యన్నారు. దీనికి కారణం.. ఈ అక్రమాల వెనుక ఉన్నది మీ బినామీలు అయిన మీ టీడీపీవాళ్లే అని ఆరోపించారు. దీన్ని అరికట్టాలన్న చిత్తశుద్ధి ఉండి ఉంటే, ఇవాళ ములకలచెరువు ఘటన తర్వాత సప్లై చేసిన మద్యం షాపుల్లోనూ, బెల్టుషాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు జరిగి, కల్తీ బాటిళ్లను పట్టుకునేవారన్నారు. కానీ అలా జరగలేదని తెలిపారు.పైగా దీనికి కారకులైన వారిని రక్షించే ప్రయత్నం చేశారని వైఎస్ జగన్ మండిపడ్డారు. అన్నమయ్య జిల్లా స్థాయి ముఖ్యనేత, టీడీపీ ఇన్‌ఛార్జి కనుసన్నల్లో ఈ కల్తీమద్యాన్ని తయారు చేస్తే, వీరిని తప్పిస్తూ తూతూమంత్రంగా కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసులో నిందితుడు, టీడీపీ ఇన్‌ఛార్జి అనచరుడు మద్యం దుకాణం వైపు అధికారులెవ్వరూ కన్నెత్తిచూడలేదన్నారు. ఈ నేరాన్నంతటినీ విదేశాల్లో ఉన్న మరోవ్యక్తిపైకి తోసేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అసలు సూత్రధారులను కాపాడేలా స్కెచ్ వేసి, మీరు ఇచ్చిన ఆదేశాల మేరకు, మీ కార్యాలయ డైరెక్షన్‌లో రాత్రికి రాత్రే కేసు మార్చేశారన్నారు. దీనికి కారణం, ఈ దందాకు మీ నుంచి, మీ చెప్పుచేతల్లో ఉన్న వ్యవస్థలనుంచి పూర్తి సహాయ సహకారాలు ఉన్నాయి కాబట్టే అని అన్నారు. మీ సొంత ఆదాయాలకోసం ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం న్యాయమేనా అని నిలదీశారు.

## కడప జిల్లాలో అమానుషం
## కన్నతల్లిని దారుణంగా



**కడప, అక్టోబరు5:** కడప జిల్లాలో ని ప్రొద్దుటూరు శ్రీరామ్ నగర్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చిం ది. కన్నతల్లి లక్ష్మీదేవిని కొడుకు యశ్వంత్ రెడ్డి హత్య చేశాడు. యశ్వ ంత్ రెడ్డికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో తనను తల్లి తిట్టిందని కూరగాయల కత్తితో గొంతు కోసి యశ్వంత్ రెడ్డి హత్యచేశాడు. వంటింట్లో లక్ష్మీదేవి ఉండగా ఆమెతో గొడవ పడ్డాడు యశ్వంత్ రెడ్డి. కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేశాడు. వంటింట్లో రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని అలాగే ఈడ్చుకుంటూ ఇంటి బయట పడేశాడు యశ్వంత్ రెడ్డి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కల కలం సృష్టించింది.తల్లి లక్ష్మీదేవి ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. నిందితుడు యశ్వంత్ రెడ్డి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తల్లిని హత్య చేసే సమయంలో తండ్రి విజయ భాస్కర్‌ని గదిలో బంధించాడు యశ్వంత్ రెడ్డి. తాను దుస్తులు మార్చుకోడానికి గదిలోకి వెళ్లగా బయట నుంచి తలుపుకి గడియ పెట్టాడు. అనంతరం వంట గదిలోకి వెళ్లి తన భార్య లక్ష్మీదేవిని అత్యంత దారుణంగా తన కుమారుడు యశ్వంత్ రెడ్డి హత్య చేశారని కన్నీరు మున్నీరుగా విలపించాడు విజయ భాస్కర్. ఈ ఘటనపై విజయ భాస్కర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఫిర్యాదు మేరకు నిందితుడు యశ్వంత్ రెడ్డిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు కడప జిల్లా పోలీసులు.

## అనంత ఘటన విచారణపై
## మంత్రి సంధ్యారాణి కీలక ఆదేశాలు



**అనంతపురం, అక్టోబరు5:** అనంతపురంలో పసిబిడ్డ మృతిపై విచారణకు ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం ఐసీడీఎస్ శిశు గృహంలో పసికందు మృతి చెందిన ఘటనపై మంత్రి సంధ్యారాణి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శిశు గృహ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసిబిడ్డ చనిపోయారనే వార్తలపై మంత్రి సమగ్ర విచారణకు ఆదేశించారు. సిబ్బంది మధ్య వివాదాల కారణంగా బిడ్డకు పాలు పట్టకపోవడమే మృతికి కారణమనే ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుకుం జారీ చేశారు మంత్రి సంధ్యారాణి.పసిబిడ్డ మృతికి అనారోగ్యమే కారణమని సంబంధిత అధికారులు చెబుతున్న నేపథ్యంలో ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ చేయాలని మంత్రి ఆదేశించారు. శిశువు మరణానికి సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం కారణమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజాలను వెలికి తీయాలని ఐసీడీఎస్ శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. పిల్లల సంరక్షణలో నిర్లక్ష్యం చూపిన వారిని ఉపేక్షించబోమని మంత్రి సంధ్యారాణి వార్నింగ్ ఇచ్చారు.

## నంద్యాల పోలీసులు బిజీబిజీ

### - 2 లారీలు,16 బైకులు స్వాధీనం

**నంద్యాల :** శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్‌అన్నారు.ఎస్.పీ ఆదేశాల మేరకు ఆదివారం ఆయా సబ్ డివిజన్ల పరిధిలోని పోలీస్ అధికారుల సూచనలతో ఆత్మకూరు టౌన్ ఇన్స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని లక్ష్మీనగర్ నందు, జూపాడు బంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని తరిగోపుల గ్రామంలో, నందికొట్కూరు రూరల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, జూపాడు బంగ్లా ఎస్సై మల్లికార్జున్‌ఆధ్వర్యంలో కోవెలకుంట్ల సర్కిల్ సంజామల పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాల గ్రామంలో కోలకుంట్ల ఇన్స్పెక్టర్, సంజామల ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా రౌడీ షీటర్లు



నేరచరిత్రులను, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని 16 మోటర్ సైకిల్లు సుమారు , 20 క్వాటర్ బాటిల్లు,30 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ను రవాణా చేస్తున్నరెండు లారీలను స్వాధీనం చేసుకున్నారుతనిఖీల అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్నేరాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యత, ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించరు...ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం, తక్షణ పోలీసు సహాయం కోసం వెంటనే 112 టోల్ ఫ్రీనంబర్ కు కాల్ చేసి పోలీసు వారి సహాయం పొందవచ్చునని తెలిపారు.నేర నియంత్రణ, శాంతియాలన్నారు భద్రతల పరిరక్షణ కొరకు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లు నిరంతరం కొనసాగుతుంటాయని ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని సంబంధిత పోలీస్ అధికారులు( కోరారు.


## శ్రీ పైడితల్లి సంబరం మూడు రోజుల్లో సిరిమానోత్సవం

**విజయనగరం :** శ్రీ పైడితల్లి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపాలని, ప్రతి సాధారణ భక్తునికి చక్కటి దర్శనం లభించేలా ఏర్పాట్లను చేయాలనీ జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అధికారులు అందుకు తగ్గట్టుగా సన్నద్ధం కావాలని తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తో కలిసి శ్రీ పైడి తల్లి పండగ, విజయనగరం ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. తొలుత జిల్లా కలెక్టర్ ఏర్పాట్ల పై తాము చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పోలీస్ శాఖ, రెవిన్యూ , దేవస్థానం సమన్వయంగా కంట్రోల్ రూమ్ నుంచి అను నిత్యం పర్యవేక్షించాలని, విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, తాగునీటి అందజేయాలని, ప్లాస్టిక్ రహితంగా ఉత్సవాన్ని నిర్వహించాలని ఆదేశించారు.టాయిలెట్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున 170 బస్సు ల వరకు అవసరం అవుతాయని, ఆయా రూట్లలో బస్సు లను ఏర్పాటు చేయాలనీ సూచించారు. విద్యుత్తు అలంకరణలు, నగరమంతా



సుందరీకరణ వారం రోజుల పాటు ఉంచాలని, పండగ వాతావరణం వెల్లి విరిసేలా ఉండాలన్నారు. ఎమ్మెల్యే పూసపాటి అథితి గజపతి రాజు మాట్లాడుతూ వీఐపీ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ప్రోటోకాల్ అధికారులు జాగ్రత్తగా చూడాలన్నారు. రథాలన్నీ తనిఖీలు చేసుకొని, వలంటీర్లకు, సేవా ప్రతినిధులకు ఐడీ కార్డులను జారీ చేయాలనీ తెలిపారు.విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాదాయ శాఖా మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి అమ్మవారికి 7 వ తేదీన ఉదయం పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లను దేవాదాయ శాఖ వారు చేయాలనీ ఆదేశించారు. సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా, గర్భగుడిలో పూజలు ఎక్కువ సమయం నిర్వహించరాదని, అర నిమిషం కన్నా భక్తులను లోపల ఉంచరాదని స్పష్టం చేసారు. విజయనగరం ఉత్సవాల ఏర్పాట్ల పై సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ వివరించారు.11 వేదికల్లో జరుగుతున్న కార్యక్రమాలను వివరిస్తూ, శనివారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తవుతాయని తెలిపారు. కళాకారులతో చేపట్టే ప్రారంభపు ర్యాలీ కు 4 వేల మంది హాజరవుతారని, వారికీ అవసరమగు ఏర్పాట్లను , తొక్కిసలాట జరగకుండా క్రమ పద్ధతి లో జరిగేలా నిర్వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశం లో జిల్లా ఎస్.పి ఏ.ఆర్. దామోదర్ , అదనపు ఎస్.పి సౌమ్య లత, కాపు కార్పొరేషన్ ఛైర్పర్సన్ యశస్వి, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కురుపాం పచ్చకామెర్ల
## విద్యార్థినిలకు మెరుగైన వైద్యం





**పార్వతీపురం మన్యం:** కురుపాం మండలం గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పచ్చకామెర్లతో బాధపడుతుండడం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో పచ్చకామెర్ల వ్యాధి 5% కంటే ఎక్కువ ఉన్న విద్యార్థినులను అధికారులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు పార్వతీపురం ఆసుపత్రిలో గురుకులం సెక్రటరీ గౌతమి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినిలు పచ్చకామెర్లతో బారిన పడడానికి గల కారణాలు అన్వేషిస్తున్నట్లు చెప్పారు.ఈ విషయంపై రాష్ట్ర స్థాయి అధికారుల బృందం దర్యాప్తు చేస్తున్నారని గౌతమి పేర్కొన్నారు. నీటి వలన ఈ వ్యాధి వచ్చిందనే అనుమానంతో అక్కడ వాటర్‌ను పరీక్షించినట్లు తెలిపారు. నీటిలో ఎటువంటి సమస్య లేదని నిర్ధారణ అయిందని వివరించారు. పచ్చకామెర్లు 5% కంటే ఎక్కువగా ఉన్న విద్యార్థినులు మొత్తం 36 మంది ఉన్నట్లు గుర్తించిననట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 120 మంది విద్యార్థినిలు చికిత్స పొందుతున్నట్లు గౌతమి స్పష్టం చేశారు.కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 611 మంది చదువుతున్నారు. అయితే.. గతంలో ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు పచ్చకామెర్ల లక్షణాలతో మృతి చెందారు. ఈ ఘటనతో సర్వత్రా ఆందోళన చెలరేగింది. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితికి గల కారణాలు తెలుసుకోవడానికి అధికారులు తీవ్ర స్థాయిలో చర్యలు చేపడుతున్నారు.

## ఆటో డ్రైవర్ల సేవలో ఇలా ఏపీ వ్యవసాయశాఖ మంత్రి

**పార్వతీపురం:** గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు అన్నారు. పార్వతీపురంలో శనివారం ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్నిఆయన ప్రారంభించారు. అర్హులైన ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ఏడాదికి జమ చేయనున్నట్లు ఆయన వివరించారు.రాష్ట్రంలో అర్హత ఉన్న2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేసారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే



ఏపీలో సంక్షేమం-అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూర దృష్టితో అభివృద్ధి-సంక్షేమం- సుపరిపాలన ద్వారా రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తున్నారన్నారు.రాష్ట్రం రూ. 1000 కోట్ల రూపాయలతో రహదారులకు అభివృద్ధి చర్యలు చేపట్టి నట్లు చెప్పారు. రాష్ట్రమంతటా జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్రపాల్గొన్నారు.

## దగ్గు మందుతో చిన్నారుల మృతి మధ్యప్రదేశ్ వైద్యుడి అరెస్టు

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్ చింద్వారా జిల్లాలో కోల్డ్రిఫ్ దగ్గు మందు తాగి 10 మంది చిన్నారులు మరణించిన కేసులో పోలీసులు ఓ డాక్టర్‌ను అరెస్టు చేశారు. చిన్నారులకు ఈ కాఫ్ సిరప్‌ను సూచించినందుకు డా.ప్రవీణ్ సోనీని అదుపులోకి తీసుకున్నారుఅంతకుముందు పోలీసులు, డా.సోనీపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సిరప్‌ను తయారు చేసిన శ్రీసన్ ఫార్మాసిటుకల్స్ ఆపరేటర్లపై కూడా కేసు పెట్టారు. బ్లాక్ మెడికల్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. చిన్నారులకు డా. సోనీ కోల్డ్రిఫ్ దగ్గు మందును సూచించినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఆ సిరప్‌లో డైఇథిలిన్ గ్లైకాల్ (డీఈజీ) అనే విషపూరిత రసాయనం ఉన్నట్టు ల్యాబ్ రిపోర్టుల్లో వెల్లడైంది. డీఈజీతో కిడ్నీలు చెడిపోయి మరణం సంభవిస్తుందని నిపుణులు చెబుతున్నారు ఇక దగ్గు మందుతో మరణాల ఉదంతం



దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. చిన్నారులకు కాఫ్ సిరప్‌లు సూచించే విషయంలో అప్రమత్తత పాటించాలని తెలిపింది.కాఫ్ సిరప్ విషయంలో పలు రాష్ట్రాల కూడా అప్రమత్తమయ్యాయి. చిన్నారుల మరణా లకు కారణమైన కోల్డ్రిఫ్ ఔషధాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం శనివారం నిషేధం విధించింది. ఇక కాంచీపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహి స్తున్న శ్రీసన్ ఫార్మాసిటుకల్స్‌పై అధికారులు ఇప్ప టికే దర్యాప్తు ప్రారంభించారు. అక్టోబర్ 1న రాష్ట్ర ప్రభుత్వం మధ్యప్రదేశ్ తరహా నిషేధాన్ని ప్రకటి ంచింది. ఈ క్రమంలోనే కేరళ రాష్ట్రం కూడా కోల్డ్రిఫ్‌ను నిషేధించింది. ఈ దగ్గుమందు విక్రయాలు చేయొద్దని ఆదేశించింది. కులుషి తమైన కోల్డ్రిఫ్ దగ్గుమందు బ్యాచ్ తమ రాష్ట్రంలో లేకపోయినా ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

## కరూర్ తొక్కిసలాట ఒక కుట్ర: ఖుష్బూ



**కరూర్ :** తమిళనాడు కరూర్ పట్టణంలో నిర్వహించిన విజయ్ పార్టీ ర్యాలీలో నెలకొన్న తొక్కిసలాటపై ప్రముఖ నటి, బీజేపీ నేత ఖుష్బూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కరూర్ తొక్కిసలాటపై ఇవాళ మీడియాతో మాట్లాడిన ఖుష్బూ.. దీని వెనుక కుట్రకోణం కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఉందని కూడా ఆమె ఆరోపించింది.ఈ తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. రాజకీయ వేత్తగా మారిన ప్రముఖ తమిళ నటుడు విజయ్ నేతృత్వంలోని పార్టీ ర్యాలీ సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది.ఘటన సమయంలో పోలీసుల నిర్వహణలో లోపాలు, అనుమతుల ఆలస్యం, సమర్థవంతమైన ఏర్పాట్లు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి సంకేతాలని ఖుష్బూ ఆరోపించారు. అటు, విజయ్ కూడా ఈ ఘటనను రాజకీయ కుట్రగా చిత్రీకరిస్తూ, దర్యాప్తు కోరారు. మద్రాస్ హైకోర్టు ఈ ఘటనపై దర్యాప్తును ఆదేశించింది. నాయకుల నిర్లక్ష్యాన్ని కోర్టు ఖండించింది.మరోవైపు, ఈ ఘటన రాజకీయ ఆరోపణలు, బ్లేమ్ గేమ్‌లకు నెలవుగా మారిపోయింది. ప్రభుత్వం వీడియోలు విడుదల చేసి టీవీకే పార్టీ తీరును ఎండగట్టే ప్రయత్నం చేస్తోంది. అదే సమయంలో భవిష్యత్ పబ్లిక్ ఈవెంట్లకు కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తామని కూడా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు.

## కొండచరియలు విరిగిపడి 17 మంది మృతి బంగాల్‌లో భారీ వర్షాలు

**డార్జిలింగ్ :** శనివారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బంగాల్ డార్జిలింగ్ జిల్లాలోని మిరిక్‌తో పాటు సుఖియా పొఖారీ ప్రాంతాల్లో మట్టిపెళ్లలు విరిగిపడి 17మందికి పైగా మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో పలువురు చిన్నా రులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే అక్కడకు చేరుకున్న విపత్తు నిర్వహణ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. గాయ పడ్డవారిని రక్షించి ఆస్పత్రులకు తరలించారు. నదులు ప్రమా దకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.విచారణ వ్యక్తం చేసిన ప్రధాని మోదీమరోవైపు బంగాల్ డార్జిలింగ్ ఘటనపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతా పం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. బాధితులకు అన్ని రకాల సహాయ చర్యలు అందిం చేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. భారీ వర్షాల దృష్ట్యా డార్జిలింగ్ ప్రాంతంలో పరిస్థితిపై నిశిత పరిశీలన చేస్తు న్నామని పేర్కొన్నారు.మిరిక్, కుర్సియాంగ్ పట్టణాలను కలిపే దుడియా ఇనుప వంతెన కూలి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. కొండచరియలు విరిగిపడి బంగాల్, సిక్కిం మధ్య రోడ్లు తెగిపోయాయి. డార్జిలింగ్-సిలిగుడి మధ్య ప్రధాన రహదారి దెబ్బతింది. ఫలితంగా కాలింపాంగ్ జిల్లాలోని లావా-గోరుబతన్ స్ట్రెచ్ గుండా రాకపోకలు సాగించాలని ప్రయా ణికులకు పోలీసులు సూచించారు. ముర్షిదాబాద్, బిర్భూమ్, నాడియా జిల్లాలతో పాటు డార్జిలింగ్, కాలింపాంగ్, కూచ్ బెహార్, జల్పైగురి, అలీపుర్దువార్‌లలో భారీ



వర్షాలు కురుస్తు న్నాయి. తీస్తా, మాల్ వంటి పర్వత ప్రాంత నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. సిలిగుడి, టెరాయ్, డూయర్స్ ప్రాంతాల్లో కమ్యూనికేషన్, రవాణా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా వర్షాలు తగ్గు ముఖం పట్టే వరకు డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కా లికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.ఉత్తరాది జిల్లాల్లో సహా యక చర్యలకు తీవ్ర ఆటంకంకుంభవృష్టి కారణంగా బంగా ల్‌లోని ఉత్తరాది జిల్లాల్లో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. కొండచరియల విరిగిపడే ప్రమాదం ఉందనే హెచ్చరికలతో డార్జిలింగ్‌లోని టైగర్ హిల్, రాక్ గార్డెన్‌తో సహా పర్యాటక ప్రదేశాలను మూసివేయాలని స్థానిక యంత్రాంగం నిర్ణయించింది. డార్జిలింగ్ టాయ్ ట్రైన్ సర్వీసులను నిలిపి వేశారు. మరోవైపు సిక్కింలోని అన్ని జిల్లాలకు భారత వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. భూటాన్‌లో దంచికొడుతున్న వానల కారణంగా బంగాల్‌లోని ఉత్తరాది జిల్లాల్లో ఆకస్మిక వరదలు పోటెత్తే ప్రమాదం ఉందని అంచనా వేసింది.మరోవైపు బంగాల్‌లోని డార్జిలింగ్ సబ్‌డివిజన్‌లోని విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో జాతీయ విపత్తు దళం మూడు బృందాలను మోహరించిందని ఎన్?డీఆర్?ఎఫ్ డీఐజీ మొహ్సెన్ షాహెది తెలిపారు. కుండపోత వర్షాలు భారీ విధ్వంసాన్ని సృష్టించాయని, కొండచరియలు విరిగిపడ్డాయని తెలిపారు. ఈ ఘటనలో దాదాపు ఏడుగురు మరణించారని, కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మాల్డా, కోల్‌కతా నుంచి అధికారులు మరో రెండు బృందాలను తరలిస్తున్నట్లు చెప్పారు.ఇదిలా ఉండగా భారీ వర్షాలకు తీస్తాతో సహా అనేక నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా మూగజీవాలు వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. కమర్‌ఘాట్ ప్రాంతంలో ఏనుగుల గుంపు నీటిలో చిక్కుకుంది. కొన్ని చోట్ల జింకలు గ్రామల్లోకి ప్రవేశించాయి. మరోవైపు ఈశాన్య సరిహద్దు లోని అలీపుర్దువార్ డివిజన్?లోని అనేక రైళ్లను అధికారులు రద్దు చేశారు. బంగాల్ నుంచి అసోంకు వెళ్లే అనేక రైళ్లు రద్దు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొండ చరియలు విరిగిపడి రోడ్లు దెబ్బతినడంతో డార్జిలింగ్‌లో ఉన్న పర్యటకులను బయటకు వెళ్లవద్దని సూచించారు.

## వైన్ షాపు ధ్వంసం చేసిన మహిళలు లక్షల సొమ్ము నేలపాలు



**ఉత్తర ప్రదేశ్ :** కొంతమంది మహిళలు లిక్కర్ షాపుపై దాడికి పాల్పడ్డారు. షాపు మొత్తం ధ్వంసం చేసేశారు. లక్షలు విలువ చేసే సరుకును నేలపాలు చేశారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆగ్రాలోని ఖేరాఘ ర్‌లో కొద్దిరోజు లక్రితం తీవ్ర విషాదం చోటుచేసు కుంది. దుర్గామాతను ఉత్తంగ్ నదిలో నిమజ్జనం చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది.కుసియాపూర్‌కు చెందిన 13 మంది నీటిలో మునిగిపోయి చనిపోయారు. దీంతో సంఘటన జరిగిన గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. ఇది ఇలా ఉండగా నిన్న కుసియాపూర్ గ్రామ శివార్లలో ఉన్న లిక్కర్ షాపు ఓపెన్ అయింది. ఈ విషయం గ్రామస్తులకు తెలిసింది. మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. పెద్ద సంఖ్యలో లిక్కర్ షాపు దగ్గరకు చేరుకున్నారు. ‘13 మంది చనిపోయి వారం కూడా కాలేదు.అప్పుడే షాపు ఓపెన్ చేస్తావా?’ అంటూ మండిపడ్డారు. షాపులోకి చొరబడి లోపల ఉన్న లిక్కర్ కేసులను తీసుకు వచ్చి బయట పడేశారు. షాపు మొత్తం ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు షాపు దగ్గరకు చేరుకున్నారు. అతి కష్టం మీద మహిళలకు సర్దిచెప్పారు. శాంతించిన మహిళలు అక్కడినుంచి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కుప్పలు తెప్పలుగా లిక్కర్ బాటిళ్ల కేసులు రోడ్డుపై పడున్న దృశ్యాలు ఉన్నాయి.

## ఈవీఎంలపై పెద్దగా సీరియల్ నెంబర్లు, కలర్ ఫోటోలు సీఈసీ వెల్లడి

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఎన్ని కల కమిషన్‌చురుకుగా సమావేశాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో రెండ్రోజుల పర్యటనలో భాగంగా శనివారంనాడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా, ఆదివారంనాడు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో పాట్నాలో ఎన్నికల కమిషన్ సమావేశమైంది. అనంతరం ఎన్నికల సన్నద్ధతపై మీడియాకు వివరాలు తెలియజేసింది.వరుస సమావేశాలుఆదా యం పన్ను శాఖ, పోలీసు శాఖ, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ ఆదివారంనాడు సమావేశమైంది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పథకంపై సమీక్ష జరిపింది. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధు లతో సమావేశమంది. ఆ వెంటనే చీఫ్ సెక్రటరీ, డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర బ్యూరోక్రాట్లతో రాష్ట్ర స్థాయిలో సమన్వ యంపై సమీక్ష జరిపింది.ఓట్ల పండుగను విజయవంతం చేయం డిబిహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 22వ తేదీలోగా ఎన్నికలు నిర్వహిస్తామని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మీడియాతో



మాట్లాడుతూ చెప్పారు. ఎలక్షన్ కమిషన్ టీమ్ మొత్తం రెండ్రో జులుగా బిహార్‌లోనే ఉందని, రాష్ట్ర పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధిపతులు, నోడల్ అధికారులతో సమావేశాలను నిర్వహించామని చెప్పారు. ఛాత్ పండుగను ఎంత ఉత్సాహంగా జరుపుకుంటామో అంతే ఉత్సాహంతో బిహార్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతమైనందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామని చెప్పారు.బిహార్ ఎన్నికల నుంచే.ఈవీఎంలపై సీరియల్ నెంబర్ ఫాంట్ పెద్దదిగా, అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ఉంటాయని, ఈ ప్రక్రియ బిహార్ ఎన్నికల నుంచే మొదల వుతోందిని చెప్పారు. ఈవీఎంలలో బ్యాలెట్ పెపర్ ఇన్‌సర్ట్ చేసినప్పుడు ఫోటో బ్లాక్ అండ్ వైట్‌లో ఉంటే గుర్తించడం కష్టమవుతోందని, ఎన్నికల గుర్తుల విషయమూ అంతేనని అన్నారు. ఈసారి నుంచి దేశవ్యాప్తంగా సీరియల్ నెంబర్ ఫాంట్లు పెద్దవిగా ఉండేలా, అభ్యర్థుల ఫోటోలు కలర్‌లో ఉండే లా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఒకటి లేదా రెండు దశల్లోకాగా, ఎన్నికల కమిషన్‌తో జరిపిన సమావేశంలో బిహార్ ఎన్నికలు ఒకటి లేదా రెండు విడతల్లో పూర్తి చేయాలని వివిధ పార్టీలు కోరారు. ఒకే దశలో ఎన్నికలు నిర్వహించాలని నితీష్ సారథ్యంలోని జనతాదళ్-యునైటెడ్ (జేడీయూ) కోరగా, జేడీయూ భాగస్వామ్య పార్టీగా ఉన్న బీజేపీ ఒకటి లేదా రెండు దశల్లో ఎన్నికలు జరపాలని సూచించింది. లాలూ ప్రసాద్ యాదవ్ ఆర్జేడీ ఒకటి లేదా రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సుముఖత తెలిపింది.

## ఆ హత్యలపై దర్యాప్తు జరిపించకపోతే జైల్లోనే ఉంటా : సోనమ్ వాంగ్‌చుక్




**లఢఖ్:** లఢఖ్ కు రాష్ట్రహోదాకోసం డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో జనం నిరసనలకు దిగగా అల్లర్లు చెలరేగాయి. ఆ అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 90 మందికిపైగా గాయపడ్డారు. దాంతో లఢఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఓ సందేశం పంపారు.లఢఖ్ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర్య దర్యాప్తు జరిపించాలని, లేదంటే తాను జైల్లోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వాంగ్‌చుక్ తన సందేశంలో హెచ్చరించారు. కాగా, వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సేతాన్ డోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయనను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు.తాను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నానని, తన కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు అని తన సందేశంలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. నలుగురి హత్యలపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.లేదంటే తాను జైలులోనే ఉండేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. లఢఖ్‌కు రాష్ట్రహోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఏడీఏ) చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు.కాగా సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే లేహ్‌లో ఆందోళనలు జరిగాయని ఆరోపించిన కేంద్రం.. జాతీయ భద్రతాచట్టం కింద ఆయనను అరెస్ట్ చేయించింది. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలలపాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆమె పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.

## నితీశ్ వీడియోను షేర్ చేసిన తేజస్వీ యాదవ్

**పాట్నా:** బీహార్ సీఎం నితీశ్ కుమార్ వీడియో క్లిప్‌ను ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ షేర్ చేశారు. ఆయన మానసిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడపలేకపోతున్నారన్నది స్పష్టంగా కనిపిస్తున్నదని విమర్శించారు. ఢిల్లీలో జరిగిన ప్రధాని మోదీ కార్యక్రమంలో సీఎం నితీశ్ కుమార్ తన నివాసం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. టీవీ స్క్రీన్‌లో మోదీ వైపు చూస్తూ తన రెండు చేతులను జోడిస్తూ ఉండిపోయారు.కాగా, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు. సీఎం నితీశ్ కుమార్ మానసిక ఆరోగ్యం, ప్రభుత్వాన్ని నడిపించే సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం చేశారు. చాలా కాలంగా సరైన మానసిక స్థితిలో లేరన్నట్లుగా ఆయన ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ‘ముఖ్యమంత్రి ఈ మానసిక స్థితికి ఆయన



సన్నిహితులు కారణమా?’ అని ఆ పోస్ట్‌లో ప్రశ్నించారు. నితీశ్ కుమార్ ఆహారంలో వారు ఏదో కలుపుతున్నారని బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.మరోవైపు సాధారణ మహిళలతో పాటు, తన తల్లి రబ్రీ దేవి గురించి నితీశ్ కుమార్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ‘ఆయన వికృత ప్రవర్తనకు మరో ఉదాహరణను నిన్న మనం చూశాం. ప్రభుత్వాన్ని నడిపించే సామర్థ్యం సీఎంకు లేదు. ఒక సిండికేట్ ఆయనపై దాడి చేస్తోంది. అది త్వరలో బయటపడుతుంది’ అని మీడియాతో అన్నారు.

## నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు 18 మంది మృతి


**నేపాల్, అక్టోబర్ 5 :** మొన్నటి వరకూ జెన్ జెడ్ ఆందోళనతో అట్టుడికిన దాయాది దేశం నేపాల్.. ఇప్పుడు భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమౌతోంది. కుండపోత వర్షాలు, పెల్లుబి కుతున్న వరదలతో ఇప్పటి వరకూ ఆదేశంలో 12 మంది ప్రాణా లు కోల్పోయారు. నేపాల్‌లోని ఇలమ్ జిల్లా తీవ్రంగా ప్రభావి తమైంది. గత 24 గంటల్లో మృతుల సంఖ్య ఈ స్థాయికి చేరడం పరిస్థితికి అద్దం పడుతోంది.మృతుల సంఖ్య మరింత పెరిగే అవ కాశం ఉందని కోషి ప్రావిన్స్ పోలీస్ ప్రతినిధి ఎస్ఎస్‌పి దీపక్ పోఖ్రేల్ పేర్కొన్నారు. ‘వర్షాలు, వరదల కారణంగా కలిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నామని, ప్రస్తుతం ప్రాథమిక వివరాలు మాత్రమే తమ వద్ద ఉన్నాయని ఆయన చెప్పారు.ఇలమ్ జిల్లాలోని సూర్యోదయ మున్సిపాలిటీలో 5 మంది, మాంగ్సెబుంగ్ మున్సిపాలిటీలో ముగ్గురు, ఇలమ్ మున్సిపాలిటీలో ఆరు మంది, డెయుమై మున్సిపాలిటీలో ముగ్గురు, ఫాక్‌ఫోక్‌థుమ్ విలేజ్ కౌన్సిల్‌లో ఒక్కరు మరణించారని సదరు అధికారి తెలిపారు. నేపాల్లో వర్షాకాలం సెప్టెంబర్ చివరి వారంతో ముగిసినప్పటికీ, మళ్లీ వర్షాలు ముంచెత్తడంతో వరదలు, కొండచెరియలు



విరిగిపడ్డం తదితర ఉపద్రవాలు సంభవించాయి. ఈ ఏడాది వర్షాలు గట్టిగా పడతాయనే అంచనా ఉన్నప్పటికీ, ఈనెల (అక్టోబర్) లో కురిసిన అకాల వర్షాల కారణంగా ఇంతటి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.కాఠ్మాండూ వ్యాలీలో నదులు (బాగ్మతి, హనుమంతే, మనోహరా మొదలైనవి) నీటి స్థాయిలు పెరిగి, వరదలు, ల్యాండ్‌స్లైడ్‌లకు కారణమవుతున్నాయి. సున్సరి, ఉదయ్‌పూర్, సప్తరి, సిరాహా, ధనుషా, మహెూత్తరి, సర్లాహి, రౌతహట్, బరా, పార్సా, సింధులి, డోలఖా, రామెఛాప్, సింధుపాల్‌చోక్, కవ్రేపా లాన్‌చోక్, కాఠ్మాండూ, లాలిత్పూర్, భక్తపూర్, మక్వాన్‌పూర్, చిత్వాన్ జిల్లాల్లో హై రిస్క్ ఉందని హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్చరించింది .రెస్క్యూ ఆపరేషన్లకు నేపాల్ ఆర్మీ, ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, నేపాల్ పోలీస్ అన్ని ప్రభావిత ప్రాంతాల్లో మోహరించాయి. కాఠ్మాండూ వ్యాలీలో ప్రధాన నది చుట్టుపక్కల గ్రామాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. నివాసితులు, వాహనదారులు నదీ సమీపంలో ప్రయాణం చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని వర్షాలు పడే అవకాశం ఉందని అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ ఓకే

**వాషింగ్టన్:** రెండేండ్లుగా కొనసాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగింపునకు మరో ముందడుగు పడింది. గాజా () నుంచి బలగాలను ఉపసంహరించేందుకు ఇజ్రాయెల్ () అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ () వెల్లడించారు. హమాస్ () కూడా దీన్ని అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని తెలిపారు. గాజాలో శాంతి స్థాపనకు



ట్రంప్ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 20 అంశాలతో కూడిన ప్రణాళికను ఇరు పక్షాల ముందు ఉంచారు. దీనికి ఇజ్రాయెల్‌తోపాటు హమాస్ కూడా తెలిసిందే.ప్రణాళికలో తొలిదశలో భాగంగా గాజా నుంచి బలగాల ఉపసంహరణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు. దీనిని హమాస్‌కు కూడా పంపించామని, అంగీకరిస్తే తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని చెప్పారు. దీంతో ఇజ్రాయెల్- హమాస్ మధ్య బందీలు, ఖైదీల అప్పగింత ప్రారంభమవుతుందని తెలిపారు.

# జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గడ్డం వెంకటస్వామి 96.వ జయంతి ఉత్సవాలు

**జైపూర్ : అక్టోబర్ 5,**
జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఘనంగా గడ్డం వెంకటస్వామి 9వ జయంతి ఉత్సవాలు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాకా అభిమానులు హాజరైనారు. అలాగే అన్నదాన కార్యక్రమంచేసి కేక్ కట్ చేయడం జరిగిం అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ.. కాకా అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే కాక బడుగు బలహీన వర్గాల కోసం కాకా ఎల్లప్పుడూ కృషి



చేసినారు. వారి ఆశలను వారి తనయుడు చెన్నూర్ ఎమ్మెల్యే మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వారి మనుమడు గడ్డం వంశీ కాకా ఆశయాలను నెరవేరుస్తూ ముందుకు కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,కాకా అభిమానులు హాజరైనారు.

# చెన్నూరు పట్టణంలో ఘనంగా స్వర్గీయ కాకా వెంకటస్వామి ౯6వ జయంతి వేడుకలు.

**చెన్నూరు: అక్టోబర్ 05** చెన్నూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాకా చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. తర్వాత కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. 1945లో కాంగ్రెస్ పార్టీలో యూత్ జనరల్ సెక్రటరీగా రాజకీయ రంగ ప్రవేశం చేసి 1956 లో సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగింది. తదనంతరం సిద్దిపేట ఎమ్మెల్యేగా సిద్దిపేట ఎంపీగా పెద్దపల్లి ఎంపీగా కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా పలు సేవలు అందించిన గొప్ప రాజకీయవేత్త పేదల పెన్నిధి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏడుసార్లు ఎంపీ పదవి చేపట్టిన మొట్టమొదటి దళిత నాయకుడు కాకా వెంకటస్వామి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం



జరిగింది. తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ రాజమల్ల గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల బాప గౌడ్, జిల్లా సెక్రెటరీ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హేమంత్ రెడ్డి, బషీర్, అంకా గౌడ్, చెన్నూరి శ్రీధర్, లింగంపల్లి మహేష్, చెన్నూరి రాజేష్, కలవండి మహేష్, సుల్తాన్, కమలాకర్, భీం మధు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, చెన్నూరు మాజీ సర్పంచ్ సాధన బోయిన కృష్ణ, చింతల శ్రీనివాస్, సుశీల్ కుమార్, చెన్న వెంకటేష్, కొంపెల్లి బానేశ్, పెండ్యాల శ్రీకాంత్, ఇబ్రహీం, సలీం,పోటు శ్రీనివాస్ రెడ్డి, ఈర్ల నారాయణ, తదితర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# పెద్దపెల్లి మాజీ ఎంపీ కాకా వెంకటస్వామి 96వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు

**ఓదెల: అక్టోబర్ 05**
పెద్దపెల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూరు రైల్వే గేట్ వద్ద పెద్దపల్లి మాజీ ఎంపీ కాకా వెంకటస్వామి 96 వ జయంతి సందర్భంగా పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో కొలనూర్ రైల్వే గేట్ వద్దఫోటోకు పూలమాలవేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది. ఆనాడు కేంద్ర కార్మికశాఖ మంత్రిగా ఉన్న సమయంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాక చేసిన కృషి మరువలేనిది సిడబ్ల్యూసి లో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు తీర్మానం చేయించిన ఘనత కాకా వెంకటస్వామిది అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్పి రాజయ్యగౌడ్, ఓదెల మల్లికార్జున టెంపుల్ డైరెక్టర్ జంగంకొమురయ్య యాదవ్, గాజులశివశంకర్,కందుల అశోక్ పటేల్,జంగంకొము రయ్య,వేల్పుల కుమార్ యాదవ్,తుమ్మలకొండయ్య, గుండేటి ఐలయ్య,పంది నరసయ్య తుమ్మలసంపత్, ఆవుల రాజయ్య, పంది అంజయ్య పాల్గొన్నారు.



# కంచర్ల రాజశేఖర్ రెడ్డి ని ఘనంగా సన్మానించిన ఆందోల్ మైసమ్మ దేవాలయ కమిటీ , సిబ్బంది

**చౌటుప్పల్: అక్టోబర్ 05 :**
ఈ మధ్య వెలువడిన గ్రూప్ 2 ఫలితాలలో చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన కంచర్ల రాజశేఖర్ రెడ్డి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా నియమితులైనందునా గ్రామంలో ఆదర్శంగా నిలిచి ఇలాగే గ్రామ యువకులు స్ఫూర్తిగా తీసుకొని అనేక ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని కోరుకుంటూ ఆందోలు మైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు , దేవాలయ సిబ్బంది అందరూ కలిసి కంచర్ల రాజశేఖర్ రెడ్డి ని పూలమాల , శాలువతో ఘనంగా సన్మానించి అభినందించి దేవుని చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ( %జూా%) మోహన్ బాబు , దేవస్థాన చైర్మన్ చిలుకూరి మల్లారెడ్డి , ధర్మకర్తలు బుర్ర స్వామి గౌడ్ , చిట్టెంపల్లి జంగయ్య , అత్తాపురం అంజిరెడ్డి , కంచర్ల ప్రవీణ్ రెడ్డి, సోమ రాఘవేందర్ రెడ్డి , ఎలువర్తి రవీందర్ , గుండ్ల అశోక్ , ఎల్లంకి రమేష్ చారి



, సంగం యాదమ్మ మల్లేష్ , పకీరు గణేష్ రెడ్డి , చేపూరి మహేష్ , ఈడుదుల పరమేష్ యాదవ్ , పబ్బు కిరణ్ గౌడ్ , గ్రామస్తులు ఈదూల మస్తాన్ యాదవ్ , కంచర్ల అశ్విన్ రెడ్డి ,



వల్లపు స్వామి యాదవ్ , పన్నాల మహేందర్ రెడ్డి , పాటి సురేందర్ రెడ్డి , పన్నాల శేషివర్ధన్ రెడ్డి , దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దసిలి పట్టు పురుగులు పెంచే రైతులను ఇబ్బండి పెట్టవద్దు మారిశెట్టి విద్యాసాగర్

**కోటపల్లి : అక్టోబర్ 05**
కోటపల్లి మండలం కావర కొత్తపల్లి రాజారాం గ్రామంలో గత 60ఏండ్లు గా తమ జీవనపాధిగా చేస్తున్నా దసిలి పట్టు పురుగులు పెంచే రైతులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టడంతో. ఈరోజు చెన్నూర్ మాజీ శాసనసభ్యులు, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డా: బాల్క సుమనన్న ఆదేశానుసారం విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ అటవీ అధికారుల వద్దకు వెళ్లి ఎఫ్ ఆర్ ఓ సాధనందము తో మాట్లాడి పట్టు రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని సూచించారు. వెంటనే అటవీ అధికారులు ఇకముందు వారిని ఇబ్బందికి గురి చేయబోము అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో రాజరం మాజీ ఉపసర్పంచ్ తిరుపతి



రావ్,పారిపెల్లి మాజీ సర్పంచ్ గడ్డల లచ్చన్న,వెంకటి, సంతోష్,తిరుపతి, చలపతి తదితరులు పాల్గొన్నారు..

# ఎన్నికల తనిఖీల లో భాగంగా కోటపల్లి మండలం పారుపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి అధికారులు విస్తృత తనిఖీలు




**కోటపల్లి : అక్టోబర్ 05**
ఎన్నికల తనిఖీలలో భాగంగా కోటపల్లి మండలం పారుపల్లి చెక్పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా మహారాష్ట్ర రాష్ట్రం సిరంచ తాలూకా రేగుంట గ్రామానికి చెందిన గడపల్లి సాయి (23) అనే యువకుడు నాగపూర్ నుండి స్వగ్రామానికి వెళ్తుండగా, అతడి %వీఎ 33 ూజ% 3555 నంబరు గల స్కార్పియో వాహనంలో ?1,90,000 నగదు లభ్యమైంది. ఆ మొత్తానికి సంబంధించి ఎటువంటి రసీదులు, ఆధారాలు చూపించలేకపోవడంతో, మండల తహసీల్దార్ టి. రాఘవేంద్రరావు, పోలీస్ ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో నగదు సీజ్ చేయబడింది. సీజ్ చేసిన డబ్బు వివరాలు జిల్లా ఎన్నికల అధికారికి పంపించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీలో గిర్దావార్ శ్రీనివాస్ తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలకు నీళ్లు.

**- ఎన్నికల నిబంధనలు పాటించని కార్యదర్శులు.**
**- చోద్యం చూస్తున్న అధికారులు.**
**- మంచాల మండలంలో విడ్డూరం**

**మంచాల :సెప్టెంబరు 5 :**
మంచాల మండలంలో ఎన్నికల కోడ్ కి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నట్లు గ్రామాల్లోని ఈ చిత్రాలే అధికారుల తీరుకి అద్దం పడుతున్నాయి. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేసిన శిలాఫలకాలను కనిపించకుండా ఉంచాల్సి ఉండగా చాలా గ్రామాల్లో ఇలాంటి చర్యలు తీసుకోకుండా అలాగే వదిలేశారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీని మంచాల మండలంలో అక్కడక్కడ దాదాపు అన్ని గ్రామాలను పైపై చర్యలతో చేతులు దులిపేసుకున్నారని అర్థమవుతుంది. మండలంలోని మంచాల,చిత్తాపూర్,తాళ్లపల్లి గూడ,లింగంపల్లి,జాపాల, ఎల్లమ్మ తండా, బోడకొండ,సత్తి తండా,ఆంబోతు తండా, లోయపల్లి గ్రామాలలో అధికారులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. అధికారుల తీరు విడ్డూరంగా ఉందని ఓటర్లు అంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నిబంధనలు పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# గిరిజన విద్యార్థుల మరణాలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే.

**పార్వతీపురం మన్యం జిల్లా**
: పార్వతీపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బి. రవికుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వి ఎస్ కుమార్ మాట్లాడుతూ కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. స్కూల్లో ఉన్నప్పుడే విద్యార్థులకు ఆరోగ్యం పరిస్థితి బాగోలేనప్పటికీ అక్కడ ఉన్న హెచ్ఎం,



వార్డెన్ విద్యార్థినుల తల్లిదండ్రులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. సుమారుగా 85 మంది విద్యార్థులు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారంటే దీనికి నిర్లక్ష్యం ఎవరిని ప్రశ్నించారు. ఇప్పటికీ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం సుమారుగా 20 మంది విద్యార్థులను కేజీహెచ్ కి తరలిం చామని అన్నారు. తమ పిల్లలను కేజీహెచ్ కి ఎందుకు తలరిస్తున్నారో తమకే తెలియదని విద్యార్థిని తల్లిదండ్రులు అన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**- పొంచి ఉన్న ప్రమాదం**
**- ఆదమరిస్తే అంతే సంగతి**



**మంచాల : సెప్టెంబరు 5,**
మంచాల మండలం లోయపల్లి ఎల్లమ్మ తండా గ్రామాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతూ ఉన్నాయి. చేతికి తాకే విధంగా విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న స్పందించట్లేదని రైతులు వాపోతున్నారు. చాలా రోజులుగా స్తంభాలు ఒరిగిపోయి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని , ఇదే రోడ్డు గుండా నిత్యం అధికారులంతా ప్రయాణిస్తున్నారని,చూసి చూడనట్లే నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరగకూడని ప్రమాదం జరిగితే పూడ్చలేని నష్టం జరుగుతుందని దానికి అధికారులే ప్రధాన బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు.

# జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి పర్యటన.

**పార్వతీపురం మన్యం జిల్లా : అక్టోబర్ 5**
:కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జాండీస్ లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థునుల ఆరోగ్యం నిలకడగా ఉందని గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి ఎం. గౌతమి అన్నారు. విద్యార్థుల మృతి చాలా బాధాకరమని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఆదివారం పార్వతీపురం సర్వజన ఆసుపత్రిని ఆమె



సందర్శించారు. ఆసుపత్రిలో విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవలను ఆమె పరిశీలించి, విద్యార్థులు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెంట్ కి సూచించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతిపురం సబ్ కలెక్టర్ డా. ఆర్.వైశాలి, వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెంట్ నాగ శివ జ్యోతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భావితారలకు భరోసానిస్తూ
## భారత క్రికెట్‌పై ముద్ర వేస్తున్న అగార్కర్

భారత క్రికెట్‌లో ఎందరో చీఫ్ సెలెక్టర్లను చూశాం. కానీ, సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన వాళ్లు మాత్రం కొందరే. ప్రస్తుతం ప్రధాన సెలెక్టర్ పదవిలో ఉన్న అజిత్ అగార్కర్ కచ్చితంగా రెండో కోవకే చెందుతాడు. ప్రతిసారి స్క్వాడ్ ఎంపికలో తనదైన ముద్ర వేస్తున్నాడీ మాజీ పేసర్. ఇంగ్లండ్ పర్యటనకు స్క్వాడ్ ఎంపిక నుంచి ఆసియా కప్ . ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ వరకూ అతడు తనదైన పంథాను కొనసాగిస్తున్నాడు. సీనియర్లకు చెక్ పెడుతూ భావితారలకు భరోసానిచ్చేలా స్క్వాడ్ ఎంపిక ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని చెప్పకనే చెబుతున్నాడు అగార్కర్. అందుకే.. తన నిర్ణయాలను కొంతమంది విమర్శించినా.. టీమిండియా ప్రయోజనాలే తనకు ముఖ్యమని మొండిగా ముందుకు వెళ్తున్నాడు అతడు. మాజీ పేసర్ అయిన అగార్కర్ 2023 జూలై 4న చీఫ్ సెలెక్టర్ పదవి చేపట్టాడు. అప్పటి నుంచి అతడి ప్రతి నిర్ణయం సీనియర్లను ఆశ్చర్యపరిచేలా.. జూనియర్లకు అవకాశాలు కల్పించేలా ఉంటోంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ సలహాలు, సూచనల్ని పాటిస్తూనే.. జట్టుకు ఉపయోగపడే ఆటగాళ్లను మాత్రమే తీసుకుంటున్నాడు అగార్కర్.ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27ను దృష్టిలో పెట్టుకొని ఇంగ్లండ్ పర్యటనకు కొత్త కెప్టెన్ అవసరమని భావించిన అతడు. సీనియర్లు రోహిత్ శర్మ విరాట్ కోహ్లీలకు సంకేతాలు ఇచ్చాడు. దాంతో.. వారిద్దరూ ఒకరివెంట ఒకరు సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. హిట్‌మ్యాన్, విరాట్ టెస్టులకు అల్విదా చెప్పడంలో చీఫ్ సెలెక్టర్, హెడ్‌కోచ్ పాత్ర ఉందనే విమర్శలు వచ్చినా అగార్కర్ వెనక్కి తగ్గలేదు. యువకుడైన శుభ్‌మన్ గిల్‌కు సారథ్యం అప్పగిస్తూ స్క్వాడ్‌ను ప్రకటించింది అతడి నేతృత్వంలోనే సెలెక్టర్లు. సీనియర్ల గైర్హాజరీలో గిల్ సమర్థంగా జట్టును నడిపించగా. టీమిండియా సిరీస్‌ను సమం చేసింది.ఇక టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్ కోసం పొట్టి క్రికెట్ వీరులకే పట్టం కట్టాడు అగార్కర్. ఒకప్పటి సారథి హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, సంజూ శాంసన్‌లను తీసుకోవడమే కాదు.. గిల్‌ను ఓపెనర్‌గా ఎంపిక చేశాడు. అనంతరం.. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు స్క్వాడ్ ఎంపికలోనూ తనమార్క్ చూపించాడు అగార్కర్. ఇంగ్లండ్ గడ్డపై విఫలమైన కరుణ్ నాయర్ పై వేటు వేసి. పునరాగమనం కోసం నిరీక్షిస్తున్న షమీని పక్కన పెట్టేశాడు. నాయర్ స్థానంలో కుర్రాడు దేవ్‌దత్ పడిక్కల్‌కు ఛాన్స్ ఇవ్వడంతో పాటు, సాయిసు దర్శన్‌కు మరోమారు కొనసాగించాడు. శనివారం ఆస్ట్రేలియా పర్యటనకు స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు రోహిత్ శర్మకు షాకిస్తూ గిల్‌ను వన్డే కెప్టెన్‌ను చేశారు.ప్రపంచకప్ లక్ష్యంగారెండేళ్లలో వన్డే ప్రపంచకప్ ఉన్నందున రోహిత్‌ను కాదని.. గిల్‌కే పగ్గాలు అప్పగించింది అగార్కర్ బృందం. టెస్టుల్లో సమర్థుడైన నాయకుడిగా నిరూపించుకున్న గిల్.. వన్డేల్లోనూ టీమిండియాకు బెస్ట్ కెప్టెన్ అవుతడాని భావించడమే అందుకు కారణం. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ సన్నద్ధతకు గిల్‌కు సమయం కావాలి కాబట్టి.. ఆసీస్ సిరీస్‌తోనే అతడికి బాధ్యతలు ఇవ్వడం మంచిదని అతడు అనుకొని ఉంటాడు.





# వెలుగులు చిమ్మిన వెండి

గత నెలలో 19 శాతం పెరిగిన ధరలు ధరల పెరుగుదలలో పసిడి, వెండిలు నువ్వా..నేనా అన్నట్టు పోటీపడుతున్నాయి. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న వీటి ధరల కారణంగా సామాన్యుడు జంకుతున్నారు. గత నెలలో అయితే రెండంకెల స్థాయిలో పుంజుకున్నాయి. దీంట్లో వెండి మరో అడుగుముందుకేసి 19 శాతం ఎగబాకింది. సెప్టెంబర్ 1న రూ.1.26 లక్షల స్థాయిలో ఉన్న కిలో వెండి అదే నెలచివరి నాటికి రూ.1,50,500కి ఎగబాకింది. అంటే కేవలం 30 రోజుల్లోనే కిలో వెండి ఏకంగా రూ.24,500 ఎగబాకినట్టు అయింది. ఇటీవలకాలంలో ఒకే నెలలో ఇంతటి స్థాయిలో ఎగబాకడం ఇదే తొలిసారి కావడం విశేషం. వెండికి పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు ముఖ్యంగా సౌర విద్యుత్, టెక్నాలజీ రంగాల నుంచి డిమాండ్ అంతకంతకు పెరుగుతుండటం కూడా ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోవడానికి ప్రధాన కారణమని సర్వేలు వెల్లడిస్తున్నాయి. వెనుకంజలో పుత్తడిబంగారం స్పీడ్‌కు బ్రేక్‌లు పడ్డాయి. వెండి ధరలతో పోలిస్తే పుత్తడి స్వల్పంగా ఎగబాకింది. గత నెలలో పదిగ్రాముల గోల్డ్ ధర రూ.14,330 లేదా 13.56 శాతం ఎగబాకింది. గత నెల మొదట్లో రూ.1,05,670గా ఉన్న పదిగ్రాముల ధర చివరి నాటికి రూ.1,20,000కి చేరుకున్నది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, అమెరికా షట్‌డౌన్‌తో మదుపరులు తమ పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్ల నుంచి పుత్తడి మార్కెట్లకు తరలించడంతో వీటి ధరలు అధికమయ్యాయని కమోడిటీస్ మార్కెట్ విశ్లేషకులు వెల్లడించారు. దేశీయంగా అమ్ముడవుతున్న వెండిలో 60-70 శాతం ఇండస్ట్రియల్ వినిమయానికి వినియోగిస్తున్నారు.అలాగే సౌర ప్యానెల్ అప్లికేషన్లు అధికంగా ఉండటం, 2024లో 232 మిలియన్ ఔన్స్‌ల డిమాండ్ రావడం కూడా మరో కారణం. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్, విద్యుత్‌తో నడిచే వాహనాలు కూడా ఉన్నాయని వెంచర్ హెడ్ ఎన్ఎస్ రామస్వామి తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం ఔన్స్ గోల్డ్ ధర 3,871.81 డాలర్ల స్థాయిలో కదలాడుతున్నది. రెండు రోజుల క్రితం గోల్డ్ ధర రికార్డు స్థాయి 3,896.74 డాలర్లు పలికిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో వెండి కూడా శాతం అధికమై 47.75 డాలర్లు పలికింది.




# మూడ్రోజుల్లోనే ముగించారు

అహ్మదాబాద్: సొంతగడ్డపై టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. రవీంద్ర జడేజా (104 నాటౌట్, 4/54) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే నెగ్గిన భారత్ రెండు టెస్ట్‌ల సిరీసలో 1-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. రెండో, ఆఖరి టెస్ట్ ఈ నెల 10 నుంచి ఢిల్లీలో జరగనుంది. ఓవర్‌నైట్ స్కోరు 448/5 వద్ద భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. విండీస్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (162)కు 286 రన్స్ ఆధిక్యాన్ని నమోదు చేసింది. ఆటకు మూడో రోజైన శనివారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విండీస్ 146 పరుగులకే కుప్పకూలింది. అథనజె (38) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జడేజా 4, సిరాజ్ 3, కుల్దీప్ 2 వికెట్లు తీశారు పేకమేడలా..: తొలి సెషన్‌లో పిచ్ బౌలర్లకు సహకరిస్తున్న వేళ విండీస్ కనీస పోరాటం కూడా చేయలేదు. సిరాజ్ బౌలింగ్‌లో నితీశ్ అందుకొన్న క్యాచ్‌తో ఓపెనర్ చందర్‌పాల్ (8) పెవిలియన్ చేరాడు. వన్‌డౌన్‌లో వచ్చిన అథనజె వికెట్‌ను అంటిపెట్టుకొన్నా.. మరో ఓపెనర్ క్యాంప్‌బెల్ (14), బ్రండన్ కింగ్ (5)ను జడ్డూ వెనక్కిపంపాడు. కెప్టెన్ చేజ్ (1)ను కుల్దీప్.. హోప్ (1)ను జడేజా అవుట్ చేయడంతో.. లంచ్ సమయానికి విండీస్ 66/5తో ఓటమి దిశగా సాగింది. తిరిగి వచ్చాక అథనజెను సుందర్.. గ్రీవ్స్ (25), వారికన్ (0)ను సిరాజ్ అవుట్ చేయడంతో విండీస్ ఓటమి ఖరారైంది. జొహన్ (14)ను జడేజా.. ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన సీల్స్ (22)ను కుల్దీప్ పెవిలియన్ చేర్చారు. దీంతో రెండు సెషన్లు కూడా పూర్తి కాకుండానే కరీబియన్ల కథ ముగిసింది.స్కోరుబోర్డువెస్టిండీస్ తొలి ఇన్నింగ్: 162 ఆలౌట్‌బీ భారత్ తొలి ఇన్నింగ్స్: 448/5 డిక్లేర్డ్‌బీవెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 14, చందర్‌పాల్ (సి) నితీశ్ (బి) సిరాజ్ 8, అథనజె (సి అండ్ బి) సుందర్ 38, కింగ్ (సి) రాహుల్ (బి) జడేజా 5, చేజ్ (బి) కుల్దీప్ 1, హోప్ (సి) జైస్వాల్ (బి) జడేజా 1, గ్రీవ్స్ (ఎల్బీ) సిరాజ్ 25, పియర్రీ (నాటౌట్) 13, వారికన్ (సి) గిల్ (బి) సిరాజ్ 0, లేన్ (సి) సిరాజ్ (బి) జడేజా 14, సీల్స్ (సి అండ్ బి) ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 45.1 ఓవర్లలో 146 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-12, 2-24, 3-34, 4-35, 5-46, 6-92, 7-98, 8-98, 9-122, 10-146బీ బౌలింగ్: బుమ్రా 6-1-16-0, సిరాజ్ 11-2-31-3, జడేజా 13-3-54-4, కుల్దీప్ 8.1-3-23-2, సుందర్ 7-1-18-




# డీమార్ట్‌లో అద్భుతమైన ఆఫర్లు

విజయదశమి సందర్భంగా తన కస్టమర్ల కోసం ప్రత్యేక దసరా ప్రత్యేక ఆఫర్‌ను తీసుకువచ్చింది. ఎంపిక చేసిన స్టోర్స్‌లో దాని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో వివిధ వస్తువులపై భారీ తగ్గింపులను ప్రకటించింది. ఈ ప్రత్యేక ఆఫర్‌లో అత్యంత ఆకర్షణీయమైన భాగం కిరాణా విభాగంలో 20 శాతం నుండి 30 శాతం తగ్గింపు. బియ్యం, గోధుమలు, నూనె, పప్పులు వంటి రోజువారీ నిత్యావసరాలు ఇప్పుడు గతంలో కంటే రూ. 10 నుండి 20 ధరకు చౌకగా లభిస్తాయి. ఉదాహరణకు 5 కిలోల బాస్మతి బియ్యం కేవలం రూ. 350కే లభిస్తాయి, 10 లీటర్ల నూనె రూ. 1,100కే లభిస్తుంది. పాల ఉత్పత్తులపై 15 శారోజువారీ నిత్యావసరాలు ఇప్పుడు గతంలో తం తగ్గింపు ఉంది. అమూల్ పెరుగు లేదా పన్నీర్ ఇప్పుడు బడ్జెట్‌లో సరిపోతాయి. పండ్లు, కూరగాయలపై అదనంగా 10 శాతం తగ్గింపుతో ప్రతిదీ చౌక ధరకు లభిస్తుంది. గృహాలంకరణ వస్తువులు, పండుగకు సిద్ధం చేసే పూజా వస్తువులపై 25 శాతం నుండి 40 శాతం వరకు తగ్గింపు ఉంది. రంగురంగుల దీపాలు, మంగళ కలశం, పువ్వులు, ధూపం కర్రలు, కొత్త కుండలు ఇప్పుడు సగం ధరకే లభిస్తాయి. ముఖ్యంగా స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లు, గిన్నెలు 30 శాతం చౌకగా, ప్లాస్టిక్ పూజా ప్లేట్లు 50 శాతం చౌకగా ఉంటాయి. బట్టలపై 20 శాతం తగ్గింపు, పురుషులకు చొక్కాలు, ప్యాంటులపై 15 శాతం చౌకగా ఉంటాయి. పిల్లల కోసం కొత్త దుస్తుల శ్రేణి ఉంది. ఈ ఆఫర్ వ్యక్తిగత సంరక్షణ వస్తువులకు కూడా ప్రత్యేకమైనది. సబ్బు, షాంపూ, టూత్‌పేస్ట్ వంటి వస్తువులపై 20 శాతం తగ్గింపు, లిక్విడ్ హ్యాండ్ వాష్ 73 శాతం వరకు చౌకగా ఉంటుంది.హోం ఎలక్ట్రానిక్స్ లాగానే, మీరు బ్లెండర్లు లేదా మిక్సర్లపై అదనంగా 10 శాతం తగ్గింపు పొందుతారు. మీరు యాప్ నుండి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఉచిత డెలివరీ సౌకర్యం, 5 శాతం అదనపు క్యాష్‌బ్యాక్ కూడా ఉంది. కస్టమర్ల నుండి ఆకస్మిక స్పందన వచ్చింది, స్టాక్ నాలుగు రోజుల్లో అయిపోయే అవకాశం ఉంది. ఈ ఆఫర్ పరిమిత కాలం మాత్రమే. వివరాలను తనిఖీ చేసి, మీ సమీపంలోని బ్రాంచ్‌లో లేదా క్లిక్ చేయడం ద్వారా కొనుగోలు చేయండి.




# జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారా

మీ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే, మీకు మంచి జీర్ణక్రియ ఉండాలి. కానీ నేటి కాలంలో జీర్ణక్రియ సరిగా లేకపోవడం, మలబద్ధకం ఒక సాధారణ సమస్యగా మారాయి. మలబద్ధకం శరీరంలో అనేక వ్యాధులకు కారణమవుతుంది. మలబద్ధకం శరీరంలోని అనేక అవయవాలకు హాని కలిగిస్తుంది. ఇది చాలా కాలం పాటు కొనసాగితే, అది క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. మలబద్ధకాన్ని నివారించడానికి, ప్రజలు అనేక రకాల మందులు, పౌడర్లను తీసుకుంటారు. కొన్ని పౌడర్లు ఉపశమనం కలిగిస్తాయి. అదేవిధంగా పతంజలి దివ్య చూర్ణం మలబద్ధకం, గ్యాస్ సమస్యల నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది. పతంజలి తన పరిశోధనలో ఈ వాదనను చేసింది. పరిశోధన ప్రకారం ఈ పౌడర్ మలబద్ధకం, గ్యాస్, కడుపు నొప్పి, ఆకలి లేకపోవడం నుండి ఉపశమనం పొందగలదు.ఈ పొడిని సహజ మూలికల నుండి తయారు చేస్తారు. ఇందులో సెన్నా, ఇంగువ, పొడి అల్లం, గులాబీ రేకులు, రాతి ఉప్పు వంటి ఔషధ మూలికలు ఉంటాయి. ఈ మూలికలు కలిసి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. పతంజలి ప్రకారం, సెన్నా, కలదాన వంటి మూలికలు ప్రేగులను సక్రియం చేస్తాయి, కడుపును శుభ్రపరుస్తాయి. ఈ పొడి గ్యాస్, కడుపు నొప్పికి కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఆసాఫోటిడా, ఎండిన అల్లం జీర్ణక్రియన మెరుగుపరుస్తాయి, ప్రేగులను శుభ్రపరుస్తాయిదివ్య చూర్ణాన్ని ఎలా తినాలిపతంజలి ప్రకారం పడుకునే ముందు ఒక టీస్పూన్ పొడిని గోరువెచ్చని నీటితో తీసుకోవాలి. మీ వైద్యుడి సలహా ప్రకారం మోతాదును పెంచవచ్చు లేదా తగ్గించవచ్చు. కానీ వైద్యుడిని సంప్రదించకుండా ఎప్పుడూ పొడిని తీసుకోకండి. అలా చేయడం హానికరం కావచ్చు.ఈ విషయాలను గుర్తుంచుకోండి ప్రతిరోజూ ఎక్కువసేపు నిరంతరం తినకండి, లేకుంటే శరీరం దానిపై ఆధారపడవచ్చు.గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు లేదా గుండె రోగులు డాక్టర్ సలహా లేకుండా దీనిని తీసుకోకూడదు.మీకు కడుపు నొప్పి, బలహీనత లేదా ం మానేయండి.కారణందానిని తినవద్దు.




# దండంరా దూత ప్రపంచకప్ కొట్టాడు 34
## సిక్సర్లు, 12 ఫోర్లతో ట్రిపుల్ సెంచరీ బాదేశాడు




ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్ అక్టోబర్ 4, 2025న ప్రాటెన్ పార్క్‌లో జరిగింది. ఇందులో వెస్ట్రన్ సబర్బ్స్ మొదట బ్యాటింగ్ చేసింది. జట్టుకు ఓపెనర్లు ఇద్దరూ మొదటి వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. 10వ ఓవర్‌లో కట్లర్ అవుట్ కాగా.. హర్జాస్ సింగ్ మూడో స్థానంలో బరిలోకి దిగాడు. క్రీజులోకి వచ్చిన ఫస్ట్ బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విధ్వంసం సృష్టించాడు. ఇన్నింగ్స్ 20వ ఓవర్‌లో 33 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. ఆ తర్వాత తన పేలుడు ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. కేవలం 141 బంతుల్లో 314 పరుగులు చేశాడు.హర్జాస్ సింగ్ తన సెంచరీని చేరుకోవడానికి 74 బంతులు తీసుకున్నాడు. ఇక ఆ తర్వాత వరుసగా సిక్సర్లతో ఊచకోత కోశాడు. కేవలం 103 బంతుల్లోనే అద్భుతమైన డబుల్ సెంచరీ సాధించాడు. ఆపై 29 బంతుల్లోనే మరో సెంచరీని పూర్తి చేసి.. మొత్తంగా 132 బంతుల్లో 301 పరుగులు చేశాడు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లో 34 సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి. హర్జాస్ సింగ్ ట్రిపుల్ సెంచరీతో.. వెస్ట్రన్ సబర్బ్స్ నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లకు 483 పరుగులు చేసింది.అసలు ఎవరీ హర్జాస్ సింగ్.ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు 2024లో ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. భారత్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో, హర్జాస్ సింగ్ అర్ధసెంచరీతో ఆస్ట్రేలియాను ఫైనల్స్‌లో అత్యధిక స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ సమయంలో హర్జాస్ సింగ్ 64 బంతులు ఎదుర్కొని 55 పరుగులు చేసి ఆస్ట్రేలియాను 253 పరుగులు చేయడంలో సహాయపడ్డాడు. హర్జాస్ సింగ్‌కు భారత్‌తో ప్రత్యేక బంధం ఉంది. అతని కుటుంబం 24 సంవత్సరాల క్రితం చండీగఢ్ నుంచి ఆస్ట్రేలియాకు వచ్చింది

# దీపావళికి ముందు పండగలాంటి వార్త

భారతీయ మహిళలకు బంగారం అన్నా, బంగారు ఆభరణాలు అన్నా ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పండగలు, వివాహాది శుభకార్యాలు, ఇతర వేడుకల సమయాల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి ధరించేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇది వారి అందాన్ని పెంచుతుందని భావిస్తుంటారు. అలాగే బంగారం అంటే సమాజంలో హోదాను కూడా ప్రతిబింబిస్తుంది. అందుకే వీలైనంత ఎక్కువ ధరించాలని ఆరాటపడుతుంటారు. బంగారం అలంకరణకే కాకుండా పెట్టుబడికి కూడా మంచి సాధనంగా ఉంది. అందుకే ఇటీవలి కాలంలో దీనికి డిమాండ్ భారీగా పెరిగింది. ప్రస్తుతం బంగారం ధర ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి చేరింది. తులం బంగారం కొనాలంటే అక్షరాల లక్షపైనే పెట్టాల్సిన పరిస్థితి ఉంది. దీంతో బంగారం కొనాలంటేనే భయపడాల్సిన రోజులు వచ్చేశాయి. అయితే ఈ పరిస్థితి మరెంతో కాలం ఉండదని బంగారం ధర భారీగా తగ్గి, ఇప్పుడు ధరకు సగం ధరకే లభిస్తుందని మార్కెట్ నిపుణుడు స్మిత్ తక్కర్ అంచనా వేశారు.గోల్డ్ రేట్స్ ఏకంగా 44 శాతం వరకు పడిపోయే అవకాశం ఉందని ఆయన అన్నారు. అయితే ఈ తగ్గుదల ఎప్పటి వరకు జరుగుతుందో అనేది ఆయన కచ్చితంగా చెప్పలేదు. కానీ, దీపావళికి ముందు ఇంత భారీ తగ్గింపు విషయం వింటుంటే మాత్రం హాయిగా అనిపిస్తుంది. అయితే ఈ తగ్గింపు ఆయన అంచనా ప్రకారం జరిగి బంగారం కొనుగోలు దారులకు మంచిదే కానీ, ఇప్పటికే బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి మాత్రం తీవ్ర నష్టాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆయన అంచనా దృష్ట్యా ఇప్పటికైతే బంగారంపై పెట్టుబడి పెట్టడం అంత మంచి పని కాదని స్మిత్ తక్కర్ అంటున్నారు. పెరుగుతున్న వడ్డీ రేట్లు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు బంగారం ధర భారీగా తగ్గేందుకు కారణం అవుతాయని ఆయన విశ్లేషించారు. రిటైల్ ఇన్వెస్టర్లు ఈ రిస్క్‌లను గమనించాలని హెచ్చరించారు.



## నయనతార డబుల్ ఫెర్ఫార్మెన్స్ పారితోషికం ఏకంగా రూ.8 కోట్లు




సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోలకి ధీటుగా నిలిచే హీరోయిన్ ఎవరంటే మనందరికి ఠక్కున నయనతార పేరు గుర్తొస్తుంది. లేడీ సూపర్ స్టార్‌గా ఆమెకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఇప్పటికీ వరుస అవకాశాలతో బిజీగా ఉండే ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సరసన 'మన శంకరవరప్రసాద్ గారు', తమిళంలో 'అమ్మాన్ 2' వంటి ప్రాజెక్టులతో తెరపై సందడి చేయబోతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి, చిరంజీవి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మన శంకరవరప్రసాద్ గారు సినిమా ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ఇందులో నయనతార 'శశిరేఖ' అనే పాత్రలో నటిస్తోంది. ఇటీవలే విడుదలైన ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది.ఈ చిత్రంలో నయన్ పాత్ర ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని టాక్. దీని కోసం ఆమె ఏకంగా రూ.5 కోట్ల పారితోషికం తీసుకుంటున్నట్లు ఫిల్మ్ నగర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. దసరా సందర్భంగా నయన్ లుక్‌ను రిలీజ్ చేసిన మేకర్స్, ఇటీవల కేరళలో షెడ్యూల్ పూర్తి చేసి, ప్రస్తుతం హైదరాబాద్‌లో సాంగ్ షూట్స్ జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, నయనతార తమిళంలో సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'అమ్మాన్ 2' సినిమాలో నటిస్తోంది. ఇందులో ఆమె మళ్లీ అమ్మవారి పాత్రలో దర్శనమివ్వనుంది. మీనా, రెజీనా, యోగి బాబు తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై డాక్టర్ ఐష్వర్య గణేష్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో నయనతారకు రూ.3 కోట్ల రేంజ్‌లో పారితోషికం అందినట్లు టాక్ ఉంది. తెలుగులో రూ.5 కోట్లు, తమిళంలో రూ.3 కోట్లు %-% ఈ రెండు సినిమాలకే మొత్తం రూ.8 కోట్ల రెమ్యునరేషన్తో నయనతార దూసుకుపోతున్న విషయం ఖాయం. ఈ స్థాయిలో పారితోషికం అందుకుంటున్న నటీమణులు చాలా తక్కువగా ఉండటంతో, నయన్ మరోసారి తన స్టార్డమ్‌ను మరోసారి నిరూపించుకుంటోంది.

## హీరో సుహాస్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం



హీరో సుహాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం మండాడి. జాతీయ అవార్డు గ్రహీత వెట్రి మారన్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో తమిళ నటుడు సూరి విలన్ గా నటించనున్నాడు. అదే తమిళ్ వెర్షన్ లో సుహాస్ విలన్ గా నటిస్తుండగా, సూరి హీరోగా యాక్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నై తీర ప్రాంతంలో శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ లో అపశ్రుతి జరిగింది. ఈ చిత్ర షూటింగులో భాగంగా కొన్ని సన్నివేశాలను సముద్రంలో చిత్రీకరిస్తుండగా, సాంకేతిక నిపుణులు ఉన్న పడవ ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోటి రూపాయల విలువ చేసే కెమెరాలు, ఇద్దరు వ్యక్తులు నీట మునిగిపోయారు. రామనాథ పురం జిల్లా తొండి అనే సముద్రతీర ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. అయితే, యూనిట్ సభ్యులు నీట మునిగిన వ్యక్తులను రక్షించడంతో ప్రాణ నష్టం తప్పింది. అయితే ఈ ప్రమాదంలో కోట్ల రూపాయల విలువైన కెమెరాల సహా ఇతర సామాగ్రి నీట మునిగిపోయాయి.మండాది సినిమాకు మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహిస్తున్నాడు. ఇన్ఫోటైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోన్న ఈ సినిమాకు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. సుహాస్, సూరిలతో పాటు మహిమా నంబియార్, సత్యరాజ్, అచ్యుత్ కుమార్, రవీంద్ర విజయ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలు సమకూరుస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.కాగా ఇటీవలే రెండోసారి తండ్రిగా ప్రమోషన్ పొందాడు హీరో సుహాస్. అతని భార్య లలిత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సుహాస్-లలితలది ప్రేమ వివాహం. ఏడేళ్లు పాటు ప్రేమించుకున్నారు కానీ పెద్దలు నో చెప్పేసరికి 2017లో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. గతేడాది జనవరిలో సుహాస్ భార్య లలిత మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడు మరోసారి వీళ్లకు కొడుకు పుట్టాడు. దీంతో సుహాస్ కుటుంబంలో సంతోషం వెల్లివెరిసింది.

## తండ్రి క్రికెటర్ తల్లి టాప్ హీరోయిన్



ప్రస్తుతం సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వడం చాలా సులభమే. కానీ వచ్చిన విజయాన్ని, స్టార్ డమ్ కాపాడుకోవడం చాలా కష్టమైన పని. సోషల్ మీడియా ద్వారా సినిమా అవకాశాలు పొందిన చాలా మంది ఇప్పుడు సినిమా ఆఫర్స్ తగ్గిపోవడంతో తిరిగి నెట్టింట సందడి చేస్తున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ఓ హీరోయిన్ మాత్రం సినిమాపై ఆసక్తి, నటనపై ఇష్టంతో సినీరంగంలోకి అడుగుపె ట్టింది. ఇప్పటికే ఇతర రంగాలలో పనిచేసేవారు సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ హీరోయిన్ సైతం ఒకప్పుడు రూ. 18000 జీతంతో బ్యాంకులో పనిచేసింది. ఆమె తండ్రి ప్రముఖ క్రికెటర్. తన ఉద్యోగాన్ని వదిలి సినిమాల్లో నటించడం ప్రారంభించింది. ఇప్పుడు ఆమె టాప్ హీరోయిన్. ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ హీరోయిన్ సోహా అలీ ఖాన్.భారత క్రికెట్ జట్టు తరపున కొన్ని మ్యాచ్‌లు ఆడిన మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ కుమార్తె సోహా అలీ ఖాన్. బాలీవుడ్ సినిమాలో ప్రసిద్ధ నటి షర్మిలా ఠాకూర్, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ భార్య. వారి కుమారుడు సైఫ్ అలీ ఖాన్ బాలీవుడ్ సినిమాల్లో టాప్ హీరో. తల్లి, సోదరుడు ఇద్దరూ సినిమాల్లో ఉన్నప్పటికీ సోహా మాత్రం సినిమాలపై ఆసక్తి లేదు. సోహా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకుంది, తరువాత ముంబైకి వచ్చి ఒక అంతర్జాతీయ బ్యాంకులో రూ. 18,000 జీతంతో పనిచేసింది. అదే సమయంలో, ఆమె ముంబైలో నివసించిన ఇంటి అద్దె రూ. 17,000. అయితే, ఆమె తన స్వతంత్ర జీవితాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ ఉద్యోగం చేస్తూనే ఉంది.ఒక సమయంలో సినిమాపై ఆసక్తి పెంచుకుంది. సినిమా అవకాశం కోసం మోడలింగ్ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 2004లో విడుదలైన 'దిల్ మాంగ్కే మోర్' (2004) చిత్రంలో నటించే అవకాశం అందుకుంది. ఇందులో సోహా అలీ ఖాన్ షాహిద్ కపూర్‌కు జోడీగా నటించింది. ఈ చిత్రానికి ఆమెకు రూ. 10 లక్షల పారితోషికం తీసుకుంది. ఆ తర్వాత వరుస ఆఫర్స్ అందుకుంది. హిందీలో అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది. ఆమె 2015లో నటుడు కునాల్ కెమ్మును వివాహం చేసుకుంది. సోహా అలీ ఖాన్ చివరిగా బాలీవుడ్ చిత్రం సురులి 2లో నటించింది.

## యూట్యూబ్‌లో అదరగొడుతున్న 'ఏమి మాయ ప్రేమలోన' మ్యూజిక్ ఆల్బమ్




అకీ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందిన 'ఏమి మాయ ప్రేమలోన' అనే మ్యూజిక్ ఆల్బమ్‌కు యూట్యూబ్‌లో అద్భుతమైన ఆదరణ లభిస్తోంది. దసరా కానుకగా విడుదలైన ఈ సాంగ్ భారీ వ్యూస్‌ను సాధిస్తూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఆల్బమ్‌లో అనిల్ ఇనుమడుగు హీరోగా నటించగా, వేణి రావ్ హీరోయిన్‌గా నటించింది. ముఖ్యంగా, అనిల్ ఇనుమడుగు ఇందులో కథానాయకుడిగా నటించడంతో పాటు, ఈ పాటకు సాహిత్యం (లిరిక్స్) అందించడం మరియు దర్శకత్వం వహించడం విశేషం. మార్క్ ప్రశాంత్ అందించిన సంగీతం, దిన్కర్ కలవుల మరియు దివ్య ఐశ్వర్య గానం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి.కేరళలోని సుందరమైన లొకేషన్స్‌లో చిత్రీకరించబడిన ఈ పాట.. కేరళలో బోటు నడిపే ఒక అనాథ కుర్రాడి జీవితంలో, మేఘాలు కమ్ముకున్న రోజు తారసపడిన ఓ అమ్మాయి ప్రేమని గెలుచుకునే సున్నితమైన ప్రేమ కథాంశంతో తెరకెక్కింది. సినిమాటోగ్రాఫర్ శ్రవణ్ పనితనం ఈ ఆల్బమ్‌కు హైలైట్‌గా నిలిచింది. కేరళలోని లొకేషన్స్‌ను ఆయన చూడముచ్చటగా చూపించారు. ప్రతి ఫ్రేమ్‌ను రిచ్‌గా, కనుల విందుగా మలచడంలో ఆయన విజయం సాధించారు. అనిల్ మరియు వేణి రావ్ జోడి స్క్రీన్‌పై చాలా సహజంగా నటించి మెప్పించారు. సుమారు పది నిమిషాల నిడివి కలిగిన ఈ ఆల్బమ్‌ను అకీ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌లో యువ నిర్మాతలు అజయ్ మరియు విష్ణు ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. కాన్సెప్ట్, డైరెక్షన్, సినిమాటోగ్రఫీ అన్నీ బాగుండటంతో ఈ పాట యూత్‌ని విశేషంగా ఆకట్టుకుంటోంది.

## ఓ పక్క రీయూనియన్ మరో పక్క ఇద్దరికీ కొత్త షెడ్యూల్



అగ్ర హీరోలు మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ ఒకే ఫ్లైట్‌లో ప్రయాణించారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. 80వ దశకంలో వెండితెర వేదికగా ఆడిపాడి అలరించిన దక్షిణాది, ఉత్తరాది నటీనటుల ందరూ ఒకేచోట కలుస్తూ సరదాగా గడుపుతుంటారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు. దీనికి '80' రీయూనియన్' అనే పేరు పెట్టారు. ప్రతి ఏటా చెన్నై, హైదరాబాద్, ఊటీ ప్రాంతాల్లో ఏదో ఒక చోట ఈ వేడుక నిర్వహిస్తుంటారు. అక్కడికి వెళ్తూ చిరంజీవి, వెంకటేశ్ ఫొటోకు ఫోజ్ ఇచ్చారు. సుహాసిని, రాధిక ఈ వేడుక బాధ్యతలు తీసుకుని నిర్వహిస్తుంటారు.20 నుంచి సెట్స్‌లో వెంకటేశ్..ఇక సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం చిరంజీవి అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా రూపొందుతోంది. చిత్రీకరణ జెట్ వేగంగా నడుస్తోంది. సంక్రాంతి కానుకగా ఈ చిత్రం ప్రేక్షకు ముందుకు రానుంది. ఇందులో వెంకటేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆ పాత్ర కథను మలుపు తిప్పే పాత్రని దర్శకుడు ఇప్పటికే చెప్పారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ అక్టోబర్ 6 నుంచి మొదలు కానుంది. ఇప్పటి వరకూ జరిగిన షెడ్యూల్స్‌లో ఇదే పెద్ద షెడ్యూల్ అని తెలుస్తోంది. దీనిలో చిరంజీవి, వెంకటేష్ పై సన్నివేశాలను కూడా తెరకెక్కించనున్నారని తెలిసింది. అక్టోబర్ 20 నుంచి వెంకటేశ్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఈ షెడ్యూల్‌తో ఆల్మోస్ట్ షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రంలో నయనతార కథానాయిక. గా ఆమెపై సాగే మీసాల పిల్ల' అంటూ సాగే పాట ప్రోమోను విడుదల చేశారు. ఈ పాటను ఉదిత్ నారాయణ పాడారు. భీమ్స్ సంగీత దర్శకుడు.

## ఎప్పటికప్పుడు నేర్చుకోవాలి అప్రమత్తంగా ఉండాలి



నేను సినిమా రంగానికి వచ్చినప్పుడు నాకు ఏదీ తెలియదు. మనసుకు ఎలా అనిపిస్తే అలా నటించేదాన్ని. ఆ తర్వాత నటనకు కొన్ని టెక్నిక్స్ ఉంటాయని తెలిసింది. పుస్తకాలు చదవడం మొదలు పెట్టా. వీడియోలు చూసేదాన్ని. ముంబాయిలో నాటక రంగంలో పనిచేశా. ఎప్పటికప్పుడు నేర్చుకోపోతే ప్రేక్షకులకు బోర్ కొడుతుంది. మనం పాతబడిపోతాం' అంటున్నారు హీరోయిన్ రాశీఖన్నా.ప్రస్తుతం తెలుగులో 'ఉస్తాద్ భగత్‌సింగ్', 'తెలుసు కదా' చిత్రాలతో బిజీగా ఉంది. 'తెలుసు కదా' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చారు.తెలుగు వచ్చేసింది.కొంతగ్యాప్ తర్వాత తెలుగులో చేస్తున్న సినిమా 'తెలుసు కదా'. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. నాకు హైదరాబాద్‌లో ఇల్లు ఉంది. వచ్చిపోతూ ఉంటాను. ఇక్కడ షూటింగ్ జరుగుతూ ఉంటే పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తోంది. తెలుసు కదా సినిమా టీజర్‌కు మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది, ఇక తెలుగు భాషపై పట్టు రావడానికి కారణం.. చాలాకాలంగా తెలుగు ఇండస్ట్రీలో ఉన్నా కదా! తెలుగు వచ్చేసింది. తెలుగే కాదు.. తమిళం, హిందీ కూడా బాగా వచ్చు. ప్రేక్షకులతో నేరుగా కనెక్ట్ కావటానికి భాష చాలా ముఖ్యం. అంతేకాదు... ఇది ఆయా భాష ప్రేక్షకులకు ఇచ్చే కనీస గౌరవంగా భావిస్తా. టాలీవుడ్‌లో హీరోయిన్లకు చాలా గౌరవం ఎక్కువ. ఆదరణ కూడా ఎక్కువ. వర్క్ అట్మాస్ఫియర్ బావుంటుంది. పైగా కాల్షీట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల దాకానే ఉంటుంది. బాలీవుడ్, తమిళ పరిశ్రమలో కాల్షీట్ పన్నెండు గంటలు ఉంటుంది. అందువల్ల ఎక్కువగా అలసిపోతాం. అంతేకాకుండా ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. తెలుగు ప్రేక్షకులకు నా పట్ల అభిమానం ఎక్కువ. నేను ఇతర భాషల్లో చేసిన సినిమాలను కూడా వారు ఆదరిస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు.అలాంటిదేమీ లేదు.బాలీవుడ్‌లో దక్షిణాది నటీనటులను తక్కువగా చూస్తారా అని చాలామంది అడుగుతారు. కానీ నాకు అలాంటి ఫీలింగ్ ఎప్పుడూ రాలేదు. అంతేకాదు, ఓటీటీ వచ్చిన తరువాత భాషపరమైన సమస్యలు తొలగిపోయాయి. ఇక్కడ హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చూస్తున్నారు. అక్కడ దక్షిణాది సినిమాలు చూస్తున్నారు. ఓటీటీలు వచ్చిన తర్వాత మంచి నటులకు అన్ని భాషల్లోనూ అవకాశాలొస్తున్నాయి. ప్రమత్తంగా ఉంటా.లేకపోతే.కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటా. నా పాత్ర, ఎలా ఉందనే విషయంపైనే ఎక్కువ దృష్టి పెడతా! కొన్నిసార్లు డైరక్టర్లు వచ్చి కథలు చెబుతారు. వాళ్ల దగ్గర స్క్రిప్ట్ ఉండదు. అలాంటప్పుడు చాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు ఇతర కారణాల వల్ల కూడా ప్రాజెక్ట్‌లు


**Published by goli sammi reddy, Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: pittala ravinder. RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com**